# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**

అనుసరించు వాని యాత్మీయుడనుకోకు
వెన్నుపోటు పొడుచు వెనుకనుండి
జాగురుకతున్న జనులుమధ్య నడువు
బ్రతుకు సూత్రమిదియె బాగుపడగ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**


తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 40 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | ఆగస్టు 08, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## 10న 'సాగర్'లో వరుణయాగం

● తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం ● పూర్ణాహుతిలో పాల్గొననున్న రేవంత్



**హైదరాబాద్,ఆగస్టు 7 :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహిం చాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణ ంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా-గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు మిగతా2లో...



## తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

ఒంటరి పోరాటంతోనూ అధికారం సాధిస్తాం

బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్టు 7 :** తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేనతో సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఎన్డీయే కూటమిలో జనసేన పార్టీ భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ భేటీ అయ్యారు.

మిగతా2లో...



## చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట

● చేతివృత్తులు, రైతులకు మార్కెట్ అవకాశాలు ● బ్రిక్స్ మంత్రుల సమావేశంలో నిర్ణయం

● కేంద్రమంత్రి పీయూష్ గోయల్

**జైపూర్,ఆగస్టు 7 :** దేశంలోని చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తుల కళాకారులు, రైతులు, మత్స్యకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు పెంచేందుకు వీలుగా కేంద్రం సరికొత్త చర్యలు తీసుకుంది. ఇందుకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల మిగతా2లో...



## అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

- కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు

**న్యూఢిల్లీ,ఆగస్టు 7 :** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై మిగతా2లో...

## చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- పీపుల్స్ ప్లాజాలో చేనేత ప్రదర్శన ప్రారంభం
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి




## మనం నాటే మొక్క... భవిష్యత్ తరాలకు మేలు

చేనేత వస్త్రాలు వినియోగించాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో మేలు




## రైతులు ఆందోళన చెందొద్దు

- కృష్ణా జలాల్లో రాష్ట్ర హక్కులను సాధించి తీరుతాం : మంత్రి (జూపల్లి కృష్ణారావు




## నీట్ ప్రశ్నలు లీక్ చేసింది ఆ ముగ్గురే

చార్జ్‌షీట్‌లో సీబీఐ స్పష్టం 20 వేల పేజీల ఆధారాలు

ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో సమర్పించినట్టు వెల్లడి

ఎన్టీఏ విధి నిర్వహణలోనూ లోపాలున్నట్టు గుర్తించిన ఏసీబీ అధికారులు




## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

● గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు ● ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక ● లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ



**న్యూఢిల్లీ,ఆగస్టు 7 :** హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్‌ఆర్టీసీ గతంలో హెచ్ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ మిగతా2లో...



## నేతన్న కడుపు కొడుతున్న కాంగ్రెస్ సర్కారు

బీజేపీ నిర్ణయాలతో చేనేత రంగానికి తీవ్ర అన్యాయం

5 శాతం జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి

చేనేత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగలేఖ

**హైదరాబాద్,ఆగస్టు 7 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నల కడుపు కొడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రంలోని నేతన్నల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ హయాంలో అమలైన మిగతా2లో...

# చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

**హైదరాబాద్,ఆగస్టు 7 :** తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు.

జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు.

యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# నీట్ ప్రశ్నలు లీక్ చేసింది ఆ ముగ్గురే

**న్యూఢిల్లీ,ఆగస్టు 7 :** నీట్ యూజీ పేపర్ లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన విషయం విదితమే. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనంటూ న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేసిన సుదీర్ఘ పోరాటం విజయాన్ని సాధించింది. ఎట్టకేలకు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే 2026 నీట్ యూజీ పేపర్ ఎలా లీకైందన్న అంశంపై సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. 94 పేజీలతో సీబీఐ ఓ నివేదికను తయారు చేసింది. సీబీఐ ఛార్జ్‌షీట్ వివరాల ప్రకారం ... ముగ్గురు సబ్జెక్టు నిపుణులు ప్రశ్నలను కంఠస్థం చేసి, చిట్టాల మీద రాసుకుని, బుక్స్‌లో సంబంధిత పేరాగ్రాఫ్‌లను మార్క్ చేసి మరీ పేపర్ లీకేజీకి పాల్పడ్డారు. **క్వశ్చన్ పేపర్ల తయారీ బృందంలో ఆ ముగ్గురు ....**నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి సంబంధించిన బృందంలోని ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులు పేపర్ లీకేజీకి పాల్పడ్డారని సీబీఐ తెలిపింది. క్వశ్చన్ పేపర్లను తయారు చేసే బృందంలో ఆ ముగ్గురూ ఉన్నారనీ, పీవీ కులకర్ణి, మనీశ్ మాంధారే, మనీషా హావల్దార్.. అనే ముగ్గురు నీట్ యూజీ పేపర్ లీకేజీకి కారణమని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపింది. కెమిస్ట్రీ సబ్జెక్టులో కులకర్ణి నిపుణుడు. వృక్ష శాస్త్రంలో మాంధారే, భౌతిక శాస్త్రంలో హావల్దార్ నిపుణులు. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటివరకు మొత్తం 13 మంది నిందితులను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఎన్టీఏ సెంటర్‌లో ప్రశ్నాపత్రాలను తయారు చేస్తున్న సమయంలో... ఈ ముగ్గురు నిందితులు ప్రశ్నలను కాపీ చేసి వాటిని చీటీలపై రాసుకున్నారనీ, కొన్ని ప్రశ్నలను ఎన్సీఈఆర్టీ బుక్స్‌లో ఉన్న పేరాగ్రాఫ్‌ల్లో మార్క్ చేసినట్టు సీబీఐ ఛార్జ్‌షీట్ ద్వారా వివరించింది. **డిజిటల్ వాడకుండా ...**ఆ ముగ్గురు నిందితులకు ఎన్టీఏలో క్వశ్చన్ సెట్టింగ్, ట్రాన్స్‌లేషన్ సెక్షన్లకు యాక్సెస్ ఉందని సీబీఐ ఛార్జ్‌షీట్ ద్వారా తెలిసింది. ఎన్టీఏ సెంటర్ నుంచి సేకరించిన సమాచారాన్ని నమ్మకమైన వ్యక్తులు, కోచింగ్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు చేరేలా చేశారనీ, అయితే ఈ ప్రక్రియ డిజిటల్ విధానాలను వాడకుండా .. నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేశారని తెలిపింది. ఆర్థికంగా లాభపడేందుకు, ట్యూషన్ విద్యార్థుల్లో సక్సెస్ రేటును పెంచేందుకు నిందితులు ఇలా చేశారని సీబీఐ పేర్కొన్నది. ప్రయివేటు కోచింగ్ సెషన్స్ సందర్భాల్లో లీక్ చేసిన ప్రశ్నలను విద్యార్థులతో రాయించారని, వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించినట్టు కూడా సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో తెలిపింది. తేలికైన ప్రశ్నలను కంఠస్థం చేసి, ఆ తర్వాత తమ హోటల్ రూమ్‌లో వాటిని పేపర్‌పై రాసుకునేవారని ఛార్జ్‌షీట్‌లో సీబీఐ అధికారులు తెలిపారు. **అనేక బ్యాంక్ అకౌంట్లు, లాకర్లు, డీమాట్ అకౌంట్లు సీజ్ ..!** గత మే 12 వ తేదీన పేపర్ లీకేజీ కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 72 మంది ఆఫీసర్లతో బృందాలను ఏర్పాటు చేసింది. 8 మంది సైబర్ ఫోరెన్సిక్ నిపుణులు కూడా సీబీఐ విచారణకు సహకరించారని తెలిపింది. మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల్లోని 92 ప్రాంతాలలో సోదాలు చేపట్టారు. ఆ తనిఖీల్లో డిజిటల్, కమ్యూనికేషన్ డివైస్‌లు, డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఆధారాలకు చెందిన ఫోరెన్సిక్ ఇమేజింగ్ జరిగినట్లు సీబీఐ వెల్లడించింది. మే 13వ తేదీన ఈ కేసులో తొలి నిందితుడిని అరెస్టు చేశారు. కోచింగ్ సెంటర్లకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. డబ్బు లావాదేవీల కోణంలోనూ కూడా దర్యాప్తు చేపట్టారు. అనేక బ్యాంక్ అకౌంట్లు, బ్యాంక్ లాకర్లు, డీమాట్ అకౌంట్లను సీజ్ చేసినట్లు సీబీఐ తన రిపోర్టులో పేర్కొన్నది. **360 మంది సాక్షులు.. 13 మంది నిందితులు..** ఎన్టీఏ విధి నిర్వహణలోనూ లోపాలు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించామన్నారు. ఎన్టీఏ కేంద్రం వద్ద చెకింగ్ కానీ ఫ్రిస్కింగ్ కానీ సమర్థవంతంగా లేవని తెలిపారు. పీవీ కులకర్ణి ఈ కేసులో ఏ2 నిందితుడని, అతను మూడు సెట్ల ప్రశ్నాపత్రాలకు చెందిన ట్రాన్స్‌లేషన్ వర్క్ కూడా చేశారని తెలిపారు. మూడు రోజుల వ్యవధిలో అతను 135 ప్రశ్నలను ట్రాన్స్‌లేట్ చేశాడని తన ఛార్జ్‌షీట్‌లో సీబీఐ పేర్కొన్నది. 13 మంది నిందితుల్లో ముగ్గురు ఎన్టీఏ సబ్జెక్ట్ నిపుణులు, కోచింగ్ వ్యక్తులు, మధ్యవర్తులు, లాభపడిన విద్యార్థులు ఉన్నారని తెలిపింది. ఎన్టీఏలో పనిచేస్తున్న కొందరు తమ అధికారాన్ని వాడుకుని రహస్య సమాచారాన్ని సేకరించినట్టు గుర్తించామన్నారు. ఈ కేసుతో లింకున్న సుమారు 20 వేల పేజీల ఆధారాలను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో సీబీఐ సమర్పించింది. విచారణలో భాగంగా 360 మంది సాక్ష్యులను పేర్కొన్నది. ప్రస్తుతం 13 మంది నిందితులు జుడిషియల్ కస్టడీలోనే ఉన్నారు.

# రైతులు ఆందోళన చెందొద్దు

**హైదరాబాద్,ఆగస్టు 7 :** ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందనీ, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వంద శాతం పూర్తి చేసి రైతులకు సాగునీరందిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీనిచ్చారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, సాగునీటి అధికారుల ప్రణాళిక మేరకే జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీటి నిర్వహణ జరుగుతోందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు నీళ్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయ లబ్ది పొందేందుకే ఆ పార్టీ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా చేస్తున్నారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం మీడియా సెంటర్‌లో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, ఈఎన్సీ (జనరల్) రమేష్‌బాబు, సీఈ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు.ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాలతో పాటు ఇతర ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరుగుతోందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పై నుంచి వస్తున్న నీటికి అనుగుణంగా సాగునీటి అధికారులు ప్రణాళిక ప్రకారం కిందికి విడుదల చేస్తున్నారని చెప్పారు. ఈ విషయం ముందే తెలిసిన బీఆర్ఎస్ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా, డ్రామాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమ ఒత్తిడితోనే అధికారులు నీటిని విడుదల చేశారంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి, ఆ జిల్లా అల్లుడు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతులకు నీరివ్వటం లేదంటూ గులాబీ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమన్నారు. రేవంత్, ఉత్తమ్ సారథ్యంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు కాంగ్రెస్ హయాంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. లక్షల ఎకరాలకు సాగునీరందించే ఆ ప్రాజెక్టులను పదేండ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం


(మొదటి పేజీ తరువాయి)

ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

# ఇంటింటికీ తాగునీటి విప్లవానికి దశాబ్ది

● మిషన్ భగీరథ దేశానికే ఆదర్శం ● ఫ్లోరోసిస్ రక్కసిని రూపుమాపిన వ్యవస్థ

● కాంగ్రెస్ నిర్లక్ష్యంతో నిర్వీర్యం : మాజీమంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్,ఆగస్టు 7 :** తెలంగాణలో ప్రతి ఇంటికీ సురక్షిత, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన మిషన్ భగీరథ పథకం నేటితో పదేండ్లు పూర్తి చేసుకోవడం సంతోషకరమని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో ఇంటింటికీ తాగునీటి విప్లవానికి దశాబ్ది కాలం పూర్తయ్యిందని ఎక్స్ వేదికగా శుక్రవారం వీడియోను షేర్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ.. దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణలో ఫ్లోరోసిస్ రక్కసిని రూపుమాపిన సుజల వ్యవస్థగా పేరుగాంచిందని వివరించారు. మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితో రూపుదిద్దుకున్న మిషన్ భగీరథ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిర్వీర్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సరిగ్గా పదేండ్ల క్రితం ఇదే రోజు గొప్ప ఆలోచనతో ప్రారంభమైన ఈ పథకం ప్రజల తాగు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపిందని తెలిపారు. మిషన్ భగీరథ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న అతిపెద్ద తాగునీటి మౌలిక వసతుల ప్రాజెక్టుగా నిలిచిందని గుర్తు చేశారు. దేశానికి రోల్ మోడల్‌గా నిలిచి హర్ ఘర్ జల్ పథకం అయిందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఒక పథకం కాదనీ, తెలంగాణ ప్రజల జీవితాలను మార్చిన మహత్తరమైన ప్రణాళిక అని వివరించారు.రాష్ట్రంలో ఏ ఇంట్లోనూ తాగునీటి కోసం ఇబ్బంది ఉండకూడదనీ, ఏ తల్లి కూడా బిందె పట్టుకుని కిలోమీటర్ల దూరం నడవకూడదనీ, ఏ గ్రామం కూడా వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కోకూడదనే సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం ఈ బృహత్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.

# చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలను సవరించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. జైపూర్‌లో జరిగిన 'బ్రిక్స్' వాణిజ్య, పరిశ్రమల మంత్రుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ లబ్ధి: హ్యాండ్‌లూమ్స్, హస్తకళలు, టెక్స్‌టైల్స్, పాదరక్షలు, ఆహార ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఈ-కామర్స్ వేదికల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేందుకు నిబంధనలను సరళీకృతం చేశారు. భారతదేశంలోని గ్రామీణ కళాకారులు, ఎంఎస్ఎంఈలు , రైతులకు ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బ్రిక్స్ దేశాల్లో పెట్టుబడులు, కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య ప్రక్రియను మరింత డిజిటలైజ్ చేయడం, కాగిత రహిత ప్రక్రియగా మార్చడం, ఓ÷ూఓఇలకు అవసరమైన ఆర్థిక సాయం వేగంగా అందించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. కాగా, బ్రిక్స్ కూటమికి కామన్ కరెన్సీ ఏర్పాటు చేసే ఆలోచనకు భారతదేశం మద్దతు ఇవ్వడం లేదని ఈ సందర్భంగా పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయం ఖాదీ, కుటీర పరిశ్రమలు, తోలు రంగానికి చెందిన కళాకారులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

(మొదటి పేజీ తరువాయి)

కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

# 10న 'సాగర్'లో వరుణయాగం

(మొదటి పేజీ తరువాయి)

11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.

# తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని, కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో ఇక్కడా విజయం సాధించి అధికారం చేపడతామన్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా బీజేపీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని రాంచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, కలిసి పోరాటం చేయాలని నితిన్ నబీన్ దిశానిర్దేశర చేశారని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరో సారి సమావేశం నిర్వహిస్తామని రాంచందర్ రావు తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబీన్.. రాష్ట్రానికి వస్తారని, ఇక్కడి నేతలతో సమావేశమై దిశానిర్దేశర చేస్తారన్నారు. ప్రజా సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు. కాగా, ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ వంటి నేతలు కూడా పాల్గొన్నారు.ద

# నేతన్న కడుపు కొడుతున్న కాంగ్రెస్ సర్కారు

(మొదటి పేజీ తరువాయి)

చేనేత సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నేతన్నలకు ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ అమలు కాలేదని తెలిపారు. చేనేత రంగం విషయంలో బీజేపీ-కాంగ్రెస్ వైఖరి ఒక్కటేనని విమర్శించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలతోనూ నేతన్నలకు తీవ్ర నష్టం జరుగుతున్నదని తెలిపారు. చేనేత రంగానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తేయడం, చేనేత ఉత్పత్తులపై ఐదు శాతం జీఎస్టీ విధించడం వంటి నిర్ణయాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు.

# మనం నాటే మొక్క... భవిష్యత్ తరాలకు మేలు

**హుస్నాబాద్,ఆగస్టు 7 :** మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మార్కండేయ ఆలయంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వన మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. "చేనేత వస్త్రాలు ప్రోత్సహిస్తామని, చేనేత వస్త్రాలు ధరిస్తామని" జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఇటీవల మరణించిన చేనేత కార్మికుడు అల్వాల రాములు కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అతిథులకు శాలువాల కప్పే బదులు చేనేత కార్మికులు నేసే వస్త్రాలను వాడాలన్నారు. దీని వల్ల పర్యావరణానికి మేలు జరగడంతో పాటు నేతన్నకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఇప్పటికే చేనేత వస్త్రాలు ఉపయోగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. గతంలో చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకునేవారని, మా ప్రభుత్వం తరుపున ఎప్పటికప్పుడు అండగా ఉంటూ ఉపాధి అవకాశాలు పెంచుతూ వారికి ఆర్థికంగా భరోసా ఇస్తున్నామన్నారు. ఆర్థిక పరమైన ఏ అంశాలు పెండింగ్‌లో లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## మహాలక్ష్మి పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్



**ఖానాపూర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరిగిన పూజ, అభిషేక కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ పాల్గొన్నారు. నూతనంగా చైర్మన్‌గా ఎన్నికై మొదటిసారి ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో బక్కశెట్టి లక్ష్మణ్, కారింగుల రాములు, గోలి వినోద్, కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.ం

## ఘనంగా భీమన్న దేవుని, పెద్దమ్మ తల్లి పండుగ



**ఖానాపూర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పద్మావతి నగర్ పంథా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భీమన్న దేవుని, పెద్దమ్మ తల్లి పండుగ మొక్కుల చెల్లింపు కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సంఘం తరపున మొక్కులు తీర్చుకున్నారు. ప్రజల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కోసం ప్రార్థిస్తూ పద్మశాలి సంఘం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నడిమెట్ల రమేష్, కోశాధికారి వెన్నం అంజయ్య, ఉపాధ్యక్షుడు కుందారపు రాజేష్, ప్రచార కార్యదర్శి నడిమెట్ల రాజేందర్‌తో పాటు సభ్యులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కె పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ



**ఖానాపూర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని బావాపూర్ కె పాఠశాలలో బోనాల పండుగను విద్యార్థులు, గ్రామ మహిళలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోతురాజుల వేషధారణలో నృత్యాలు, విన్యాసాలు చేసి ప్రజలను ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన బోనాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ, గ్రామ సంరక్షణ కోసం పిల్లలు ఆలయంలో బోనాలు సమర్పించారని తెలిపారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం అందరికీ భోజన విందు ఏర్పాటు చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహణ



**ఖానాపూర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కుమారి భవిష్య విద్యార్థులను ఉద్దేశించి చదువు, భవిష్యత్ కెరీర్‌పై దృష్టి పెట్టాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. సీనియర్ న్యాయవాది వెంకట్ మహేంద్ర బాల్య వివాహం, బాల కార్మికుల చట్టాలపై అవగాహన అవసరమని చెప్పారు. జాయింట్ సెక్రటరీ బాశెట్టి శివ విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్ నరేంద్రనాథ్ పిల్లలకు సమస్యలు ఎదురైతే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని సూచించగా, షబ్బీర్ పాషా "గుడ్ టచ్--బ్యాడ్ టచ్"పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మట్టేరి రాజశేఖర్, గ్రామ సర్పంచ్ దొనికేని లక్ష్మీ దయానంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**ఖానాపూర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాంతినగర్ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ పాల్గొని తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి రక్ష అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు గర్భధారణ సమయంలో పౌష్టికాహారం తీసుకోవాలని, పుట్టిన బిడ్డకు తల్లిపాలను ఇవ్వాలని సూచించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన, గర్భిణీ స్త్రీలకు శ్రీమంత కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల నారాయణ, అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## కడెం నీటిని విడుదల చేయాలని రైతుల డిమాండ్




**ఖానాపూర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడెం ఆయకట్టు రైతులకు సాగు నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ సింగరాయపేట పంచాయతీ తపాలాపూర్ చెక్‌పోస్ట్ వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ కడెం ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ అధికారులు విడుదల చేయకపోవడం అన్యాయమని విమర్శించారు. సమయానికి వరి సాగుకు నీరు అందకపోతే ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందని, రైతులను కాపాడే బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.

## హర్ ఘర్ తిరంగా విజయవంతం చెయ్యాలని బీజేపీ సన్నాహక సమావేశం

**మహబూబాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 10 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపునిస్తూ మానుకోట పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. హర్ ఘర్ తిరంగా--తిరంగా యాత్ర పట్టణ కన్వీనర్ మాలోతు బాలు నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా కన్వీనర్ ధార ఇందు భారతి, కో-కన్వీనర్ వీరమల్ల ప్రేమ్ రాయుడు ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ధార ఇందు భారతి మాట్లాడుతూ దేశభక్తి, జాతీయ సమైక్యత భావాలను బలోపేతం



చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని, ప్రతి ఇంటిపై జెండా ఎగరవేయడంతో పాటు ప్రజల్లో జాతీయ జెండా పట్ల గౌరవాన్ని పెంపొందించేలా అవగాహన కల్పించాలని సూచించారు. త్వరలో మానుకోటలో నిర్వహించనున్న తిరంగా ర్యాలీలో విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులు, సంఘాల ప్రతినిధులు, న్యాయవాదులు, మాజీ సైనికులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రేష్మ, పద్మ, మాలోతు శ్రీదేవి, సరోజ, రాధా పటేల్, రవికుమార్, నరేష్, రవి యాదవ్, సురేందర్, హిమేందర్, రమేష్, సుజాత, శైలజ, అనిల్, చంద్రశేఖర్, ప్రేమ్ సాగర్, గాదేపల్లి శ్యామ్, సూర్నేని రాము, కుమార్, సురేష్, సంతోష్, సంపత్, రాజు, సాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా సన్నాహక సమావేశం

**తిమ్మాపూర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. మహాత్మా నగర్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి దేశవ్యాప్తంగా తిరంగా యాత్రలు ప్రారంభమవుతాయని, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని సూచించారు. ఆగస్టు 12 నుంచి 14 వరకు స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో జాతీయ జెండాలు రెపరెపలాడాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెన్షన్ నిబంధనలు పేదలకు అన్యాయమని, వృద్ధాప్య పెన్షన్ వయోపరిమితిని 70 నుంచి 57 సంవత్సరాలకు తగ్గించాలని, వితంతు మహిళలకు వయోపరిమితి లేకుండా పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే మండల వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని



హెచ్చరించారు. కార్యక్రమంలో కల్యాణ్ చంద్ర, సంపత్, తిరుపతిరెడ్డి, పాశం రాఘవరెడ్డి, ఎర్రోజు లక్ష్మణ్, బుర్ర శ్రీనివాస్, పడాల శ్రీను, విశ్వరూప చారి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రాపర్తి రవీందర్, నరేషు, పిట్ట మహేశ్, మాడిశెట్టి నరేష్, బుడిగ మహేశ్ కుమార్, మహేందర్ రెడ్డి, జక్కోజు అనిల్, బూరుగు శ్రీనివాస్ రెడ్డి, కామర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పాలనలో దేశ భవిష్యత్ ప్రశ్నార్థకం సిపిఐ

**కరీంనగర్ రూరల్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్రంలో బీజేపీ పాలన కొనసాగితే దేశ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, గుంటూరుపల్లి, మొగ్దుంపూర్ గ్రామాల్లో శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పేదలపై భారాలు మోపుతూ విద్య, వైద్యం అందుబాటులో లేకుండా చేస్తోందని, నిరుద్యోగులకు వాగ్దానం చేసిన ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసరాల ధరలు పెంచి ప్రజల జీవన విధానాన్ని కష్టతరం చేస్తున్నారని, మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయకపోవడం మహిళలపై



చిన్నచూపు అని అన్నారు. మతాల మధ్య విద్వేషాలు సృష్టించడం, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరించడం బీజేపీ పాలన లక్షణమని, రానున్న రోజుల్లో ప్రజలు మార్పు కోరుకోవాల్సిందేనని పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మీ, నలువాల సదానందం, సాయవేణి రాయమల్లు, పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, కొట్టె అంజలి, పోలోజు రంజిత్, యుగేందర్, సంతోష్ చారి, బాకం ఆంజనేయులు, తంగెళ్ళ సంపత్, చిందం మల్లయ్య, కాల్వ కొమురయ్య, బీర్ల స్వాతి, మేకల రమ్య, నునావత్ శ్రీనివాస్, కసిరెడ్డి సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి మంత్రి ఉత్తమ్

**పెద్దపల్లి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నందున వరి సాగును విస్తరించకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన వీడియో కాన ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున కంది, పెసర, మినుములు, పప్పుధాన్యాలు, ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు వంటి పంటలను ప్రోత్సహించాలని సూచించారు. సాగునీటి విడుదలపై మరో 15 రోజులు పరిస్థితులను సమీక్షించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతి జిల్లాలో పంటల వైవిధ్యీకరణ ప్రణాళికను అమలు చేయాలని, విత్తనాలను



ముందుగానే రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున కనీసం 50 శాతం వరి సాగును ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని సూచించారు. అదే సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. గతంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోయినా, ప్రస్తుత ప్రభుత్వం 16 లక్షలకు పైగా కొత్త కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు. వనమహోత్సవం, చేయూత పెన్షన్లు, యూనిఫాం కుట్టు పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కూడా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్షతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు - ఎమ్మెల్యే విజయరమణారావు

**సుల్తానాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ పట్టణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి ఒక పబ్లిక్ స్కూల్ చొప్పున ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్‌లో పాఠశాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన అందించనున్నట్లు వెల్లడించారు. విద్యారంగ అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించినట్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, సుల్తానాబాద్ చేనేత సొసైటీ ప్రహరీ గోడ



నిర్మాణానికి రూ.10 లక్షలు, పద్మశాలి సంఘం భవనం నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. చేనేత సొసైటీ బకాయిల మాఫీ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, వైస్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ రమేష్, పద్మశాలి సంఘం నాయకులు వేముల రామ్మూర్తి, ఐల రమేష్, సాయిరి మహేందర్, చీకట్ల మొండయ్య, సామల యమున హరికృష్ణ, గోలి పద్మ శ్రీనివాస్, గాదాసు మంజుల రవి, మేరుగు యాదగిరి, గుండ మురళి, సామల రాజేంద్ర ప్రసాద్, తుమ్మ రాములు, పల్లా సురేష్, కుమార్ కిషోర్, గోరె మియా, కామిని వెంకట రమణ, ఎలిగేటి రమేష్, సుంక మహేష్, ఎల్లె రాజు, సామల రాకేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు

**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ చేనేత దినోత్సవాన్ని కరీంనగర్‌లో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. 39వ డివిజన్‌లోని చేనేత సహకార సంఘం కార్యాలయంలో జరిగిన వేడుకలకు బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతన్నల మగ్గాన్ని నేసి, వారి కళానైపుణ్యాన్ని అభినందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు కల్పించేందుకు చేసిన కృషిని గుర్తుచేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత కార్మికుల పాత్ర విశేషమని కొనియాడారు. చేనేత సంఘ అధ్యక్షులు, డైరెక్టర్లను ఘనంగా సన్మానించి, కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే రోజు 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత మరియు జౌళి శాఖ ఆధ్వర్యంలో గీత భవన్ చౌరస్తా నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన




సమావేశంలో చేనేత రంగ అభివృద్ధి, నేతన్నల సంక్షేమం, సంప్రదాయ చేనేత పరిరక్షణపై చర్చించారు. టెస్కో కరీంనగర్ డివిజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చేనేత ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్‌ను మేయర్ కొలగాని శ్రీనివాస్ పరిశీలించి ఉత్పత్తుల నాణ్యతను అభినందించారు. ఆయన మాట్లాడుతూ చేనేత రంగం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, నేతన్నల కళానైపుణ్యాన్ని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల చంద్రశేఖర్, తెళ్ళ రమేష్, చొప్పరి జయశ్రీ, మాసం గణేష్, సరస్వతి సత్యం, గుంజెటి మెతుకు సత్యం, శివన్న, అడిచర్ల రాజు, సతీష్, మునిందర్, చేనేత సంఘ నాయకులు బోగా భద్రయ్య, చంద్రయ్య, గుర్రం ఆంజనేయులు, శ్రీపతి వెంకటేశం, తుమ్మ రామస్వామి, ఆరకాల కనకయ్యతో పాటు సుమారు 500 మంది నేతన్నలు పాల్గొన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ, టెస్కో డీఎంఓ జనార్ధన్, జిల్లా పద్మశాలి సమాజ అధ్యక్షుడు మెతుకు సత్యం, కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్, చేనేత శాఖ సహాయ సంచాలకుడు జి. రాఘవరావు, శాఖ సిబ్బంది కూడా హాజరయ్యారు. కరీంనగర్‌లో జాతీయ చేనేత దినోత్సవం ఉత్సాహభరితంగా, నేతన్నల కళానైపుణ్యాన్ని ప్రతిబింబించేలా జరిగింది.

# ఘనంగా ఎస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాలలో స్వామినాథన్ జయంతి వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతరత్న, హరిత విప్లవ పితామహుడు డా. ఎం.ఎస్. స్వామినాథన్ 101వ జయంతి వేడుకలను ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి) వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, (టి.జి.సి.జి.టి.ఏ) జనరల్ సెక్రటరీ డా. కడారు సురేందర్ రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. విభాగాధిపతి ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ స్వామినాథన్ అధిక దిగుబడి వంగడాలను ప్రోత్సహించి భారతదేశాన్ని ఆహార కొరత నుంచి స్వయం సమృద్ధి వైపు నడిపించారని తెలిపారు. విద్యార్థులు ఆయన శాస్త్రీయ దృక్పథాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డా. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వామినాథన్ రైతుల సంక్షేమం, స్థిరమైన వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణపై చూపిన దూరదృష్టి విశేషమని, ఆయనకు మరణానంతరం లభించిన భారతరత్న సముచిత గౌరవమని అన్నారు. ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామినాథన్ పరిశోధనలు భారత వ్యవసాయానికి కొత్త దిశ చూపాయని, ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన రహిత హరిత విప్లవం అవసరమని పిలుపునిచ్చారు. సేంద్రియ, సహజ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగ అధ్యాపకులు డా. రౌతు రాధాకృష్ణ, డా. ఎం.డి. తహేర్ హుస్సేన్, డా. పడాల తిరుపతి, కె. కళాజ్యోతి, డా. అందె బుంగ తిరుపతి, ఎం.డి. తాజుద్దీన్, ఎ. స్వరూపారాణితో పాటు యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొని స్వామినాథన్ సేవలను స్మరించారు.

# కూచనపల్లి మాలపల్లి వంతెనకు రూ.3 కోట్ల నిధులు మంజూరు



**హుస్నాబాద్, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** కూచనపల్లి--మాలపల్లి గ్రామాల మధ్య వాగుపై వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసింది. పరిపాలన అనుమతులు లభించడంతో గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ మడప పద్మ జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మామిడి రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు కష్టతరమయ్యాయని, రైతులు, విద్యార్థులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సర్పంచ్ పేర్కొన్నారు. ఏళ్ల తరబడి సమస్య పరిష్కారం కాని పరిస్థితిలో, మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయడం ప్రజల పట్ల ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. వంతెన పూర్తయితే రెండు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయని, ఆర్థిక--సామాజిక అభివృద్ధికి ఊపునిస్తుందని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజల సమస్యలను తనవిగా భావిస్తున్నారని సర్పంచ్ అన్నారు. గ్రామ ప్రజల తరఫున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్నె రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతాంగానికి మరో శుభవార్త ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**చొప్పదండి, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నారాయణపూర్ చెరువు అభివృద్ధి, బండ్ విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు విడుదల చేసింది. భూసేకరణకు ఆమోదం లభించడంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పనులు వేగవంతం కానున్నాయి. ముఖ్యంగా బండ్ విస్తరణ, గ్రావిటీ కాలువ నిర్మాణం, చెరువుల ఆధునికీకరణ పనులు త్వరితగతిన ప్రారంభం కానున్నాయి. ఎస్సైపీ స్టేజ్--××, ఫేజ్--× కింద అమలవుతున్న గంగాధర--వేములవాడ--స్తంభంపల్లి సాగునీటి ప్రాజెక్టులో భాగంగా ఈ నిధులను వినియోగించనున్నారు. నారాయణపూర్ చెరువు బండ్ విస్తరణ, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, అనుబంధ చెరువుల అప్‌గ్రేడేషన్, కాలువల బలోపేతం వంటి పనులు చేపట్టనున్నారు. దీంతో వర్షాకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసి రైతులకు సాగునీరు అందించే అవకాశం మెరుగుపడనుంది. నారాయణపూర్ ట్యాంక్ బండ్ నిర్మాణానికి అవసరమైన 35 ఎకరాల భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు విడుదల చేసింది. ఇప్పటికే ప్రాథమిక నోటిఫికేషన్ జారీ కాగా, త్వరలోనే డిక్లరేషన్ సమర్పించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గంగాధర, బోయిన్‌పల్లి, కొడిమ్యాల, మల్యాల ప్రాంతాల రైతులకు సాగునీటి లబ్ధి చేకూరనుంది. 49,500 ఎకరాల ప్రత్యక్ష ఆయకట్టుకు, మరో లక్ష ఎకరాల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద సాగునీరు అందనుంది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత వేలాది ఎకరాలకు స్థిరమైన సాగునీటి సౌకర్యం కలగనుంది. భూగర్భ జలమట్టం పెరగడంతో బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడనుంది. రైతులు రెండో పంట సాగు చేసే అవకాశాలు పెరగడంతో వ్యవసాయ ఉత్పాదకత, ఆదాయం కూడా పెరుగుతుందని అధికారులు తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాగునీటి రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రతి ఎకరాకు నీరు అందించేలా తన కృషి కొనసాగుతుందని అన్నారు. నారాయణపూర్ చెరువు అభివృద్ధికి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షణీయమని, ఈ సహకారం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు రైతాంగ అభ్యున్నతికి, ప్రాంతీయ వ్యవసాయాభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు



**గంగాధర, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిందం ఆంజనేయులు, వస్త్రోత్పత్తి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు అలువాల విఠోభ మాట్లాడుతూ నేతాకార్మికులు, పద్మశాలీల పాత్ర సమాజంలో కీలకమని, వారి శ్రమ ద్వారానే ప్రతి వ్యక్తి వస్త్రధారణ సాధ్యమవుతోందని అన్నారు. నేతన్న విలువలను గుర్తు చేసుకుంటూ ప్రతి యేటా చేనేత దినోత్సవాన్ని జరపడం ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి చిందం రాజమౌళి, గ్రామ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి అలువాల రాజేశం, కోశాధికారి చిందం శేఖర్, నాయకులు చిప్ప చక్రపాణి, అలువాల తిరుపతి, అన్నల్ దాస్ వెంకటాద్రి, వస్త్రోత్పత్తి వ్యాపారుల సంఘం ప్రధాన కార్యదర్శి అన్నల్ దాస్, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గుండా రాజేశం, చిందం సత్యనారాయణ, కోశాధికారి బొల్లబత్తి నగేష్, గ్రామ కార్మిక సంఘం అధ్యక్షుడు అలువాల శ్రీశైలం, మాజీ అధ్యక్షుడు గడ్డం నారాయణతోపాటు పద్మశాలి సంఘం, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల పండుగ వేడుకలు




**కరీంనగర్, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ట్రినిటీ -- ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్, సాలేహ్‌నగర్‌లో బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తి, సంస్కృతి, సంప్రదాయం, సమైక్యతకు ప్రతీకగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంప్రదాయాల వైభవాన్ని చాటారు. విద్యార్థుల తల్లులు సృజనాత్మకంగా అలంకరించిన బోనాలను సిద్ధం చేసి ఊరేగింపులో పాల్గొన్నారు. పాఠశాల బ్యాండ్, పోతరాజుల వేషధారణలు, సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినుల నృత్యాలు, అలంకరించిన అమ్మవారి ఘటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థినులు ప్రదర్శించిన జానపద నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం డైరెక్టర్ డా. దాసరి మమతా రెడ్డి, ప్రిన్సిపాల్ రత్నమాల బెహరా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి సామూహిక నృత్యంలో పాల్గొని వేడుకకు మరింత శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మమతా రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించారు. చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి విద్యార్థులు పాఠ్యపుస్తక జ్ఞానంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను అర్థం చేసుకోవడం కూడా ముఖ్యమని అన్నారు. ప్రిన్సిపాల్ రత్నమాల బెహరా విద్యతో పాటు విలువలు, నైతికత, వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. వేడుక చివరగా విద్యార్థులు, తల్లిదండ్రులకు బోనం ప్రసాదం పంపిణీ చేయడంతో భక్తిశ్రద్ధల మధ్య ముగిసింది. ట్రినిటీ పాఠశాలలో జరిగిన ఈ వేడుక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, ఐక్యత పట్ల గర్వభావాన్ని విద్యార్థుల్లో పెంపొందించే సాంస్కృతిక ఉత్సవంగా నిలిచింది.

## కిసాన్ మోర్చా నాయకులు ఆధ్వర్యంలో జైలు భరో పోస్టర్ల విడుదల



**ఖానాపూర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆగస్టు 10న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం జైలు భరో కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఖానాపూర్ పట్టణంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐయుకేఎస్ జిల్లా అధ్యక్షుడు నంది రామయ్య, ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, నాయకులు జక్కుల రాజన్న, లింగాల మధు, నూనె నర్సింగరావు, గోరే బాయ్, గోనె లచ్చన్న, మచ్చ శ్రీనివాస్, సుంచుల నారాయణ, నాగుల నర్సా గౌడ్, చింతకుంట శంకర్, దూడ నర్సారాజు, రాపెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక చర్యలు మానుకోవాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం అమలు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 10న కలెక్టర్ కార్యాలయం ముందు జైలు భరో కార్యక్రమంలో రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రసన్న, యూనిఫాంల పంపిణీ



**మహబూబాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ పరిధిలోని 18వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు, అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ రేషపల్లి నవీన్ చిన్నారులకు అన్నప్రసన్న నిర్వహించి యూనిఫాంలను పంపిణీ చేశారు. గర్భిణీ స్త్రీలకు బాలామృతం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నవీన్‌ను సన్మానించారు. టీచర్లు సుజాత, సునీత, ఆయాలు కలమ్మ, బుజ్జి, తిరుపతమ్మ, వినోద, ఉమా, వాణి, భవాని, జ్యోతి, కాంతమ్మ, అచ్చాలి, సోమక్క, హైమ, విజయ, దీక్ష, సౌందర్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**పెద్దపల్లి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చందపల్లి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, మొదటి వెయ్యి రోజుల ఆహార విలువలపై అవగాహన కల్పించారు. ఆరు నెలల పిల్లలకు అన్నప్రసన్న, మూడు సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 15వ వార్డు కౌన్సిలర్ పేంజర్ల రాకేష్, 16వ వార్డు శ్రీను, 17వ వార్డు తోట ఫణిందర్, స్కూల్ టీచర్లు సదాశివం, సృజన్, అంగన్వాడీ టీచర్లు జాపతి స్వప్న, స్వరూప, కణకలక్ష్మి, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి



**పెద్దపల్లి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆట, పాటలతో ప్రజలను చైతన్యపరిచిన కళాకారులకు 'సాంస్కృతిక సారథి'లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని టీపీసీసీ సాంస్కృతిక సేన పెద్దపల్లి జిల్లా కమిటీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షుడు పిట్టల రమేష్ రచించిన పెద్దపల్లి ముద్దుబిడ్డ మన విజన్న పాటను ఎమ్మెల్యే విజయరమణారావు ఆవిష్కరించారు. కళాకారులు ఉద్యమంలో చేసిన కృషిని గుర్తు చేస్తూ, గతంలో కేవలం 550 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చి వేలాది మంది కళాకారులను విస్మరించారని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో ఉద్యమ కళాకారులకు న్యాయం చేస్తూ సాంస్కృతిక సారథిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తూండ్ల రాజయ్య, బుర్రగడ్డ రవి, దాసరి శ్రీనివాస్, పెనుగొండ ఎల్లయ్య, పూసల రమణాచారి, కన్నూరి రాజయ్య, పోలవేణి శ్రీనివాస్, తాండ్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా పెట్రోల్ పోయాలని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు



**గన్నేరువరం, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గుణుకులా కొండాపూర్ గ్రామంలోని పెట్రోల్ బంక్‌లో ఉచితంగా పెట్రోల్ పోయాలని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. హనుమాజిపల్లి గ్రామానికి చెందిన అమ్మిగల్ల ప్రశాంత్ (31) జూలై 28న అర్ధరాత్రి బంక్ సిబ్బందిని బెదిరించడంతో యజమాని రాజిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు అనుమతి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపారు. ప్రశాంత్‌పై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో 19కి పైగా కేసులు నమోదయ్యాయని, గన్నేరువరం పోలీస్ స్టేషన్లో రౌడీషీట్ కూడా తెరవబడి ఉందని అధికారులు వెల్లడించారు.

# భూమి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని టిఆర్ఎస్ డిమాండ్



కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఒంటరి మహిళ భూమిని కబ్జా చేసిన చల్మెడ లక్ష్మీ నరసింహారావుపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు.బొమ్మకల్ పరిధిలోని భూమి కబ్జా విషయంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఆయన కోరారు. మహిళను బెదిరించిన ఘటనపై కేసు నమోదు చేసి, చల్మెడను బీఆర్ఎస్ నుండి సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. భూమి కొనుగోలు చేసిన మహిళకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ రక్షణ సేన జిల్లా శాఖ ప్రకటించింది.

## ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు



హుస్నాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ మార్కండేయ ఆలయంలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలని, పాలిథిన్ శాలువాల బదులు నేతన్నలు తయారు చేసిన వస్త్రాలను వాడాలని ప్రతిజ్ఞ చేయించారు.చేనేత కార్మికుడు అల్వాల రాములు కుటుంబానికి ప్రభుత్వం తరఫున 5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచుతూ, హ్యాండ్లూమ్‌తో పాటు పవర్ లూమ్ క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మహిళలకు నేతన్నలు నేసిన ప్రత్యేక చీరలను ప్రభుత్వం అందజేస్తుందని, అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు, లింగమూర్తి, వెంకటరమణ, చేనేత సంఘ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ రహదారుల అభివృద్ధికి భారీ నిధులు మంజూరు

హుస్నాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):హుస్నాబాద్ నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు, వంతెనలు, క్రాస్ డ్రైనేజ్ పనుల అభివృద్ధికి రూ.33.70 కోట్లు మంజూరు చేశారు. పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ ఆగస్టు 6న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం మొత్తం 28 పనులకు పరిపాలనా అనుమతి లభించింది.హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో 15 పనులకు రూ.15 కోట్లు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో 9 పనులకు రూ.13.90 కోట్లు, చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో 8 పనులకు రూ.11 కోట్లు కేటాయించారు. ఇందులో వంతెనలు, కాజ్‌వేలు, రక్షణ గోడలు, స్లాబ్ కల్వర్టుల నిర్మాణం చేపట్టనున్నారు.ఈ పనులు పూర్తయిన తర్వాత వర్షాకాలంలో రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత శాఖ మంత్రులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.ప్రజలు కూడా హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్‌గా పెట్టెం నవీన్ నియామకం



కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ పట్టణానికి చెందిన పెట్టెం నవీన్‌ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్‌గా నియమించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంపీ కేసీ వేణుగోపాల్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.గతంలో రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేసిన నవీన్, ప్రతి జిల్లాలో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు.తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపిన నవీన్, పార్టీ సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా చేరువ చేస్తానని పేర్కొన్నారు.

# నేడు సబ్‌స్టేషన్ల నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ అంతరాయం

కరీంనగర్ రూరల్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కొత్తపల్లి, రేకుర్తి 33/11 కెవి సబ్‌స్టేషన్ల నిర్వహణ పనుల కారణంగా నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.ప్రభావిత ప్రాంతాలు కొత్తపల్లి, వెలిచాల, దేశరాజపల్లి, వెదిర, రాజీపూర్, రేకుర్తి, సీతారాంపూర్, కంటి ఆసుపత్రి, అంధుల పాఠశాల పరిసరాలు, సాలెనగర్, గౌడ్స్ కాలనీ, కొత్తవాడ, పాతవాడగా పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం సమయంలో ప్రజలు సహకరించాలని రూరల్ ఏడీఈ గాదం రఘు విజ్ఞప్తి చేశారు.

# అల్ఫోర్స్ పాఠశాలలో ఉత్సాహంగా మాన్సూన్ మస్తీ కార్యక్రమం




కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ (యస్6 క్యాంపస్)లో "మాన్సూన్ మస్తీ" కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. విద్యతో పాటు వినోదం కూడా అవసరమని, వినోదాత్మక విద్య విద్యార్థుల్లో నేర్చుకునే ఉత్సాహాన్ని పెంచుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. వర్షపు చినుకుల మధ్య పాటలు, నృత్యాలు, ఆటలు, సృజనాత్మక పోటీలు విద్యార్థులకు మరపురాని అనుభూతిని కలిగించాయని తెలిపారు. క్యాంపస్‌ను పండగ వాతావరణంలో అలంకరించి, విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణీయంగా నిలిచాయి.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హిరోషిమా నాగసాకి దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు



కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో సోమవారంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ & జూనియర్ కాలేజీలో హిరోషిమా--నాగసాకి దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు నిర్వహించారు. యుద్ధాలు ఉపయోగకరంగా ఉన్నాయా లేదా? అనే అంశంపై విద్యార్థులు వ్యాసరచనలో పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షుడు మ్యాదం శివకాంత్ పటేల్, ముఖ్య శరత్ కృష్ణ శాంతి, సామరస్యాల ప్రాముఖ్యతను వివరించి, యుద్ధాల వినాశకర పరిణామాలను గురు చేశారు. యువతరం శాంతియుత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల సిబ్బందికి బట్టల సంచులు పంపిణీ చేసి, ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎర్రంరాజు సింగమూరాజు, వుత్తూరి దుర్గాప్రసాద్, క్లబ్ నాయకులు బట్టు వినోద్, మెతుకు కృష్ణ చైతన్య, ఐత సూరజ్, కోల అన్నారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ యుఎస్ఎఫ్ఐ




కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ సమావేశం కరీంనగర్ పట్టణంలోని గౌరవ్ హోటల్లో జరిగింది. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి మారం తిరుపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మోడల్ స్కూల్స్‌ను సిబిఎస్ఈ స్కూల్స్‌గా మార్చే ప్రతిపాదనను స్వాగతిస్తున్నామని, అయితే వసతులు కల్పించకుండా, ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ఇది సాధ్యం కాదని ప్రశ్నించారు. జిల్లాలో అనుమతి లేకుండా అనేక జూనియర్ కళాశాలలు ఒకే పేరుతో బ్రాంచ్‌లు నడుపుతున్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని, డిగ్రీ--ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో జరుగుతున్న దోపిడీపై కలెక్టర్ విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సందగణేష్, నాయకులు హేమంత్, అరుణ్, మధు కుమార్ నాయక్, సాత్విక్, అఖిల్, శనివిక్, నైనేష్, తిరుపతి, హరికృష్ణ, ప్రణయ్, అక్షయ, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా తయారీ కీలకం స్పెషల్ అబ్జర్వర్ గౌరవ్ ఉప్పల్



సిద్దిపేట, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్ఐఆర్ ప్రత్యేక అబ్జర్వర్‌గా నియమితులైన గౌరవ్ ఉప్పల్ జిల్లాలో పర్యటించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, ఎన్నికల అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు. జిల్లాలో జూన్ 5 నుంచి ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా పునపరిశీలన కార్యక్రమం చేపట్టి 100% పూర్తి చేసినట్లు కలెక్టర్ వివరించారు. 87.97% ఓటర్ల వివరాలు డిజిటలైజేషన్ పూర్తయిందని, మిగతా 12.3%లో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్ ఓటర్లు ఉన్నారని తెలిపారు.గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశం నాణ్యమైన ఓటర్ జాబితా తయారు చేయడమేనని అన్నారు. బోగస్ ఓటర్లు లేకుండా పారదర్శకమైన జాబితా సిద్ధం చేయాలని, షిఫ్టెడ్, డెత్ ఓటర్లను గుర్తించేటప్పుడు క్షేత్రస్థాయిలో పక్కింటి వారి సంతకం తీసుకొని రెండు--మూడు సార్లు పరిశీలించి చాలని సూచించారు.డ్రాఫ్ట్ ఓటర్ జాబితా అనంతరం స్వీకరించే అభ్యంతరాలను మరోసారి పరిశీలించి ఏ ఒక్క ఓటరు మిస్ కాకుండా జాబితా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

## 402 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీకి సిద్ధం





హుజురాబాద్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కమలాపూర్ మండలంలో నిర్మించిన 402 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పేదలకు పంపిణీకి సిద్ధమయ్యాయి. హన్మకొండ ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి గూడూర్, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో గృహాలను పరిశీలించి పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ గృహాలను రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. ఇందుకు హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ బాబు కృషి చేస్తున్నారు.సొంతింటి కల నెరవేరబోతున్న 402 మంది లబ్ధిదారుల తరఫున వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రవీందర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్ గౌడ్, ప్రణవ్ బాబు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ, ఎంపీడీవో గుండె బాబు, తహసీల్దార్ సురేష్, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు బాలసాని రమేష్, పుల్ల శోభన్, ఆట్ల కళ్యాణ్, పాక చంద్రమౌళి, భాష బోయిన రమేష్, మనీష్, నవీన్, రాజు, శివానందం, చందబోయిన సాయికుమార్, రామకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక



సుల్తానాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పెద్దపల్లి జిల్లా ఎస్జీఎఫ్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థి ఆదిత్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. జావెలిన్ త్రోలో విజయం సాధించిన ఆదిత్యను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగు తాయని ఆయన పేర్కొన్నారు. ఆదిత్య హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నాడు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తల్లిదండ్రులు విద్యార్థిని అభినందించారు.

## తల్లి పాల వారోత్సవాల్లో అక్షరాభ్యాసం కార్యక్రమం





సుల్తానాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని సుల్తానాబాద్ పట్టణంలోని 12వ వార్డులోని స్వప్న కాలనీ, జవహర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.చిన్నారుల తొలి విద్యాభ్యాసానికి అక్షరాభ్యాసం ఎంతో ప్రాధాన్యత కలిగినదని ఉపాధ్యాయులు తెలియజేశారు. తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ అమిరిశెట్టి శ్రావణి--రాకేష్ పాల్గొని చిన్నారులను అభినందించారు. అంగన్‌వాడీ టీచర్లు అమిరిశెట్టి మేఘమాల, నరహరి స్వాతి, తల్లులు, సిబ్బంది పాల్గొన్నారు.తల్లిదండ్రులు చిన్నారులతో కలిసి అక్షరాభ్యాసం జరపడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

# గాయని విమలక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డప్పు అశోక్



హుస్నాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజా గాయకురాలు విమలక్క జన్మదినం సందర్భంగా ఉద్యమ కళాకారుడు పొన్నాల డప్పు అశోక్ శుభాకాంక్షలు తెలిపారు.మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన విమలక్క అణగారిన వర్గాల ప్రజల పక్షాన ఆటపాటలతో చైతన్యం కలిగించారని ఆయన పేర్కొన్నారు. సమ సమాజ నిర్మాణం, సామాజిక తెలంగాణ లక్ష్యంగా ఆమె పోరాటం కొనసాగుతోందని, ఆయురారోగ్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కవి గాయకుడు గుండేటి రమేష్ తో కలిసి శుభాకాంక్షలు తెలిపిన అశోక్, విమలక్కపై రాసిన పాటను త్వరలో రికార్డింగ్ చేసి విడుదల చేస్తామని వెల్లడించారు.

# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగరంలోని 2వ డివిజన్ చంద్రపురి కాలనీలో రూ.28 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే నగరపాలక సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో నాయకులు సాధినేని మునీందర్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యవసాయంపై ప్రత్యక్ష అవగాహన



హుస్నాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నవభారత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ గంగరవేణి రవీందర్ ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన నిర్వహించారు.పోతారం గ్రామంలోని వరి పొలాలను సందర్శించిన విద్యార్థులు నారు తీయడం, నారు పంపడం, నాటు వేయడం వంటి పనుల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు వరి సాగు విధానాలు, నీటి నిర్వహణ, పంట కోత సమయం వంటి అంశాలను వివరించారు.రైతుల శ్రమ విలువను విద్యార్థులు అనుభవిస్తూ "జై జవాన్ -- జై కిసాన్" నినాదాలు చేశారు. క్షేత్ర పర్యటన ద్వారా వ్యవసాయం పట్ల అవగాహనతో పాటు అన్నదాతల కష్టాన్ని విద్యార్థులు తెలుసుకున్నారని రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా డిగ్రీ కళాశాలలో వనమహోత్సవం



**హుస్నాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. కళాశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటగా, వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలందరూ వనమహోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పురపాలక చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌ను సందర్శించిన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) జంతుశాస్త్ర విభాగానికి చెందిన బీఎస్సీ లైఫ్ సైన్సెస్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ రాందాన్ విద్యార్థులకు చేపల కృత్రిమ ప్రజననం, చేపల పెంపక పద్ధతులు, నిర్వహణ విధానాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా చేపల ఉత్పత్తి పెంపు, మత్స్య సంపద అభివృద్ధి అంశాలను వివరించారు. విద్యార్థులు చేపల పెంపకం, ప్రజననం, మత్స్య సంపద అభివృద్ధి సంబంధిత విషయాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. ఈ క్షేత్ర పర్యటనలో లైఫ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ మనోజ్ కుమార్, అధ్యాపకులు వై. నారాయణ, జి. అనిత, యాకంబరం, మౌనిక, రవళి కృష్ణ, రమ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా ప్రభుత్వం నిలవాలని సీపీఎం డిమాండ్



**రామడుగు , ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన కొత్తూరి దుర్గయ్య (50) గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. దుర్గయ్య కుటుంబాన్ని పరామర్శించిన వాసు దేవరెడ్డి వారికి బియ్యం అందజేసి సానుభూతి తెలిపారు. ముగ్గురు కుమార్తెలతో ఉన్న ఈ కుటుంబం ఆర్థికంగా వెనుకబడిందని, ప్రభు త్వం ప్రత్యేకంగా సహాయం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవ తీసుకుని కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేసి, పిల్లల విద్యకు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిరుపేద కుటుంబాలు ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని అన్నారు. దుర్గయ్య కుటుంబానికి అవసరమైన సహాయం అందే వరకు సీపీఎం పార్టీ అండగా ఉంటుందని వాసుదేవరెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డి. నరేష్ పటేల్, మండల కన్వీనర్ ప్రభాకర్, నాయకులు ఇమానియల్ ప్రకాష్, ఐషాక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ




**సుల్తానాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని 8వ వార్డు అశోక్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దివంగత చింతల రాజు జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్సిళ్లతో కూడిన విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, 8వ వార్డు కౌన్సిలర్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందించడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిలుక రాజేశం, చింతల సంపత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోడు సాగుదారులపై అటవీశాఖ దాడులు ఆపాలని డిమాండ్



**ఖానాపూర్, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన, గిరిజనేతర రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని, అటవీశాఖ అధికారులు విధిస్తున్న ఆంక్షలను ఎత్తివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం కలెక్టర్ కార్యాల యంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్‌కు దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, నాయకులు చింతకుంట శంకర్, నాగుల నర్సా గౌడ్, దూడ నరసరాజు పాల్గొన్నారు. రైతులు 50 సంవ త్సరాలుగా సాగు చేస్తున్న భూములను అటవీశాఖ అధికారులు గుంజుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ట్రాక్టర్లతో దున్నకూడదని ఆంక్షలు విధించడం, పంటలను ధ్వంసం చేయడం సాధారణమైందని వారు తెలిపారు. పట్టాలు లేకపోవడం వల్ల యూరియా, డీఏపీ వంటి ఎరువులు పొంద డంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రెండు సార్లు సర్వే చేసిన భూములకు పట్టాలు ఇవ్వకుండా నిరాకరించిందని, కనీసం గుర్తింపు కార్డులు ఇచ్చి రైతులకు అండగా నిలవాలని కోరారు. పోడు సాగుదారులపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక చర్యలను వెం టనే ఆపాలని, పేదల సంక్షేమం కోసం పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## బాలికల భద్రతకు అండగా శక్తి యాప్



**నందికొట్కూరు, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ ఆర్ఆర్ నాయక్ పర్యవేక్షణలో శక్తి యాప్ అవగాహన కార్యక్రమం శ్రీ శారదా విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించారు. సుమారు 250 మంది విద్యార్థులకు శక్తి యాప్ వినియోగం, అత్యవసర సమయాల్లో దాని ప్రాధాన్యం వివరించారు. శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలియ జేశారు. మహిళల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టం, బాల్యవివాహాల నివారణ, చిన్నారులపై నేరాల నిరోధం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు తెలిసినప్పుడు 1098 లేదా 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళా సహాయం కోసం 181, అత్యవసర పరిస్థితుల్లో 100/112, సైబర్ నేరాల విషయంలో 1930 నంబర్లకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తూ ఫేక్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. విద్యార్థినులు ఈవ్‌టీజింగ్ లేదా వేధింపులకు గురైతే భయపడకుండా శక్తి యాప్ లేదా అత్యవసర నంబర్ల ద్వారా పోలీసుల సహాయం పొందాలని సూచించారు. 18 ఏళ్ల లోపు విద్యార్థులు మోటార్ సైకిళ్లు నడపరాదని, క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని అధికారులు సూచించారు.

## సేంద్రియ ఎరువులు పంటలకు రక్షణ వ్యవసాయ శాస్త్రవేత్తలు



**నందికొట్కూరు, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు మండలంలోని నందికొట్కూరు, నాగటూరు గ్రామాలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాల శాస్త్రవేత్తలు సందర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, సేంద్రియ ఎరువులు పంటలకు రక్షణగా నిలుస్తాయని వారు సూచించారు. మొక్కజొన్న, కంది, మినుము, పత్తి, సోయాబీన్ పంటలు తీవ్ర వర్షాభావంతో బెట్టకు గురవుతున్నాయని, తాత్కాలికంగా పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 ద్రావణాన్ని పిచికారి చేయడం ద్వారా 10--15 రోజులు పంటలను రక్షించవచ్చని తెలిపారు. ఆగస్టులో ఖాళీగా ఉన్న పొలాల్లో కొర్ర, సజ్జ, మినుము, స్వల్పకాలిక కంది పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ నీటి వినియోగంతో కనీస దిగుబడి సాధించవచ్చని సూచించారు. ఆకుల వ్యర్థాలతో మల్చింగ్ చేయడం, పశువులపెంట, కోళ్లపెంట, పచ్చిరొట ఎరువులను వాడడం ద్వారా భూమి తేమశాతం పెరిగి పంటలు ఎండబెట్టను తట్టుకునే శక్తి పొందుతాయని తెలిపారు. ఈ సంవత్సరం వరి, మొక్కజొన్న పంటలు వేయకపోవడమే మంచిదని శాస్త్ర వేత్తలు సూచించారు. కార్యక్రమంలో వ్యవ సాయ కళాశాల సహ ఆచార్యులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## నాగటూరు, తాటిపాడు ,చెలిమిల్ల లిఫ్ట్ ఇరిగేషన్ల ద్వారా సాగునీరు విడుదల





**నందికొట్కూరు, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య రైతులకు సాగునీరు అందుబాటులోకి తీసుకువచ్చారు. నాగటూరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఫేజ్--1, ఫేజ్--2 ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 864 అడుగులకు చేరుకోవడంతో దాదాపు 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఖరీఫ్ పంటల సాగుకు ఇది పెద్ద ఊతమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే జూపాడు బంగ్లా మండలం తాటిపాడు గ్రామ 1--11 ఎత్తిపోతల పథకం ద్వారా రెండు పంపుల ద్వారా 45 క్యూసెక్కులు, పాములపాడు మండలం చెల్మెల్ల గ్రామ ఎత్తిపోతల పథకం ద్వారా రెండు పంపుల ద్వారా 48 క్యూసెక్కుల సాగు నీరు, తాగునీటిని విడుదల చేశారు. ప్రతి ఎకరాకు నీరు చేరేలా, ప్రతి గ్రామానికి తాగునీరు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. నీటి విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టిఎస్కేసి జాబ్ మేళాకు విశేష స్పందన



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్), కరీంనగర్‌లోని తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో మెగా జాబ్ డ్రైవ్ ఘనంగా జరిగింది. క్యూస్ కార్ప్, ఫోస్కన్, రిలయన్స్ నిప్పోన్ ఇన్సూరెన్స్, సహస్ర సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, స్కీనేడర్ ఎలక్ట్రిక్, ఫారతూనే మెడికేర్ హాస్పిటల్, ధ్రువంత్ సొల్యూషన్స్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొని తయారీ, సాఫ్ట్‌వేర్, లాజిస్టిక్స్, అకౌంట్స్, ఫ్రంట్ ఆఫీస్, రిలేషన్‌షిప్ మేనేజర్, టెలీ కాలర్, టీమ్ లీడర్ తదితర విభాగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించాయి. ఈ జాబ్ డ్రైవ్‌కు 300 మందికి పైగా నిరుద్యోగ యువత హాజరుకాగా, వారిలో 120 మంది అభ్యర్థులు ప్రాథమికంగా షార్ట్‌లిస్ట్ అయ్యారు. వారికి ఆయా కంపెనీలు ఇంటెంట్ లెటర్స్ అందజేశాయి. తదుపరి దశలో వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించి తుది ఎంపిక చేపట్టనున్నట్లు టి ఎస్ కే సి బృందం సభ్యులు డా. డి. శ్రీనివాస, జి. రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్స్ డా. ఎన్. మనోజ్ కుమార్, డా. సిహెచ్. విద్య, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల వినూత్న నిరసన




**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాలను ప్రైవేటుపరచడానికి ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ విద్యుత్ ఉద్యోగులు వినూత్న నిరసన చేపట్టారు. కరీంనగర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం ఆవరణలో టీజీపీఈ జేఏసీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు 27వ రోజు నిరసన కొనసాగింది. ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలుపుతున్నప్పటికీ మేనేజ్మెంట్ టెండర్లను రద్దు చేయకపోవడం దుర్మార్గమని విమర్శించారు. అన్ని క్యాడర్లలో రిక్రూట్మెంట్ లేక అధిక పని భారంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, 2026 ఏప్రిల్ 1 నుంచి రావాల్సిన పిఆర్సి కోసం ఇప్పటివరకు కమిటీ ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. మేనేజ్మెంట్ మొండి వైఖరికి నిరసనగా ఆగస్టు 12న విద్యుత్ సౌధ ముందు మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. డిమాండ్లు నెరవేర్చే వరకు ఉద్యమం కొనసాగుతుందని, అవసరమైతే మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు .కార్యక్రమంలో నాయకులు మహేందర్ రావు, శ్రీనివాస్, రఘు, రాజు, రమేష్, పవన్ కుమార్, సంపత్ రావు, రంగు వెంకటనారాయణ, సంతోష్, రాచకొండ శ్రీనివాస్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు. టీజీ ట్రాన్స్కో జోనల్ ఆఫీస్ ఆవరణలో కూడా ఉద్యోగులు ఇదే విధంగా నిరసన తెలిపారు.

## రైతులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరాకై ప్రత్యేక చర్యలు ఎస్ఈ వెల్లడి



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 12 డిపార్ట్మెంట్ వాహనాలు ఏర్పాటు చేశామని, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన వెంటనే వాటిని ఉచితంగా తరలించి మరమ్మత్తులు చేసి తిరిగి అమర్చుతున్నామని తెలిపారు. రైతులు ఎటువంటి ఖర్చులు భరించాల్సిన అవసరం లేదని, లోడింగ్--అన్‌లోడింగ్ కూడా డిపార్ట్మెంట్ ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు తలెత్తిన వెంటనే 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందిస్తామని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించడం ఎన్పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని, ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేయాలని ఎస్ఈ పిలుపునిచ్చారు.

## బ్రెస్ట్ ఫీడింగ్ పై తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వరల్డ్ బ్రెస్ట్ ఫీడింగ్ వీక్‌లో భాగంగా కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ కోతిరాంపూర్ సెక్టార్‌లో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ డివిజన్ కార్పొరేటర్ సొగాని కొమురయ్య, 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదా మాట్లాడుతూ పుట్టిన వెంటనే గంటలోపు తల్లిపాలు ఇవ్వాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. గర్భిణీలు నార్మల్ డెలివరీ కోసం ముందుగానే ఆహారపు అలవాట్లు, వ్యాయామాలు పాటించాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి రాజు మాట్లాడుతూ తల్లిపాలలో శిశువుకు అవసరమైన పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే ప్రతిరక్షకాలు సమృద్ధిగా ఉంటాయని, తల్లిపాలు తాగే పిల్లల్లో విరేచనాలు, శ్వాసకోశ వ్యాధులు, పోషకాహార లోపం తక్కువగా ఉంటాయని వివరించారు. ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం ప్రారంభించినా, రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం శిశువు సంపూర్ణ ఎదుగుదలకు మేలు చేస్తుందని చెప్పారు. తల్లిపాలు తల్లికి కూడా ప్రయోజనకరమని, ప్రసవానంతరం త్వరగా కోలుకోవడం, అధిక రక్తస్రావం తగ్గడం, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతు ందని వివరించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించి ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సొగాని కొమురయ్య, ఆకుల నర్మదా, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ, చైల్డ్ లైన్ సాయి కిరణ్, మెడికల్ ఆఫీసర్ సాయి రాజు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, పిల్లలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఈ నెల 10న జైల్ భరో విజయవంతం చేయాలని సిఐటియు పిలుపు



కరీంనగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జరగనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత కిసాన్ సభ, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చాయి.కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో నాయకులు రైతు పంటలకు మద్దతు ధర, రుణ విమోచన చట్టం, విద్యుత్ సవరణ బిల్లులు, విత్తన చట్టాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం, ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం ప్రజా వ్యతిరేక చర్యలని విమర్శించారు.కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్త లేబర్ కోడ్లు తెచ్చి కార్మికులను దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. పేద, బడుగు వర్గాలపై భారమయ్యే చట్టాలను రద్దు చేసి పాత చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, మహిళా సంఘం ప్రతినిధులు, యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు పాల్గొన్నారు.ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



గంగాధర, ఆగస్టు 07(నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం రంగారావుపల్లె గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సన్‌రైజ్ కరీంనగర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.గ్రామ సర్పంచ్ దాసరి శంకరయ్య, ఉప సర్పంచ్ దేవ బహదూర్ రెడ్డి, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, గ్రామ పంచాయతీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు సన్‌రైజ్ హాస్పిటల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యం స్వాధీనం



కరీంనగర్ , ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ రూరల్ మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో పోలీసులు అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీల్లో శిరిగిరి సాగర్ ఇంట్లో 37 సంచుల్లో దాదాపు 30 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు.నిందితుడు పేద ప్రజల నుంచి తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫార్ములకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో అంగీకరించాడు. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసిన బియ్యాన్ని సివిల్ సప్లై శాఖకు అప్పగించారు.ప్రజలకు హెచ్చరికగా అధికారులు పీడీఎస్ బియ్యాన్ని దలారులకు విక్రయించవద్దని, అక్రమంగా కొనుగోలు లేదా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహణ



చొప్పదండి, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు చొప్పదండి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమార్పీఎస్ జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సి వర్గీకరణ సాధించడంతో పాటు పేద వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాలు నడిపిన విషయాన్ని గుర్తుచేశారు. కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ఉద్యమం కొనసాగుతోందని తెలిపారు.అణగారిన వర్గాల ఆర్థిక ఎదుగుదలకు ఉద్యమం అవసరమని, పూలే, అంబేద్కర్, జగజీవన్ రామ్, కాన్షిరామ్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని అన్నారు. గ్రామ స్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి బలమైన పోరాటాలు నిర్మించాలని, కొత్త కమిటీలను ఏర్పాటు చేసి యువతను ఉద్యమంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రుద్రారపు రామచందర్ మాదిగ, అద్దూరి శ్రీనివాస్ మాదిగ, అద్దూరి భూమయ్య మాదిగ, లక్ష్మయ్య మాదిగ, కుమార్ మాదిగ, ఎండి రజాక్, నంగి రవీందర్, నీలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో షీ టీమ్ అవగాహన సదస్సు



పెద్దపల్లి, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :రామగుండం సీపీ ఆదేశాల మేరకు షీ టీమ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి అమర్‌నగర్ ఎంపియుపిఎస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎస్సై లావణ్య గుడ్ టచ్--బ్యాడ్ టచ్, పోక్సో యాక్ట్, సోషల్ మీడియా ప్రభావం, యాంటీ డ్రగ్స్, మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థులు వేధింపులకు గురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100/112, ఆన్లైన్ మోసాలకు 1930 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ప్రయాణ సమయంలో టీ - సేఫ్ యాప్ ఉపయోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు స్నేహలత, మౌనిక పాల్గొన్నారు.

## ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి బోనాల పండుగ



ఖానాపూర్, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఖానాపూర్ పట్టణంలోని శివాజీ నగర్‌లో మహాలక్ష్మి అమ్మవారి బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. తిమ్మాపూర్, శాంతినగర్ ప్రాంతాల నుంచి ఓడి బియ్యం, పట్టువస్త్రాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మేళతాళాల మధ్య పోతరాజుల విన్యాసాలు, డీజే పాటలతో భక్తి పారవశ్యంగా కార్యక్రమం సాగింది. భక్తులు మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయగా, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షుడు, ఖానాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజు రా సత్యం అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా పండుగ కన్నుల పండుగగా నిర్వహించారని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గౌర్రె గంగాధర్, నాయకులు ద్యావతి రాజేశ్వర్, బక్క శెట్టి కిషోర్, వీడీసీ అధ్యక్షుడు బిసి రాజన్న, బక్క శెట్టి లక్ష్మణ్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# శాతవాహనలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలు




కరీంనగర్, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : శాతవాహన విశ్వవిద్యాలయంలో ఎస్సి ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. గిరిజన పోరాట యోధులు కొమురం భీమ్, రాంజీ గోండ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసీల సాంప్రదాయ విజ్ఞానం ప్రకృతి పరిరక్షణలో అమూల్యమని, గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ వెనుకబడిన గిరిజన విద్యార్థుల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.విశిష్ట అతిథిగా డాక్టర్ డి. హరికాంత్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల పురోగతికి రాజ్యాంగబద్ధమైన అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ గిరిజన యువతలో ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాకాంత్ ఆదివాసీల జీవనశైలిలోని పర్యావరణ అనుకూల విధానాలను గౌరవించాలని సూచించారు.కొలం తెగ కళాకారుల గుస్సాడీ బృందం సాంప్రదాయ నృత్యాలతో విద్యార్థులను ఆకట్టుకుంది. వివిధ తెగలకు చెందిన విద్యార్థులు తమ ఆచారాలు, సంస్కృతి, సాంప్రదాయాలను పరిచయం చేశారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులకు లాభాలు సంజయ్ జాజు




కరీంనగర్, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు రైతులను వరి సాగు బదులుగా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని సూచించారు. రానున్న నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున నీటి అవసరం తక్కువగా ఉండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆయిల్‌పామ్, కూరగాయలు వంటి పంటలను ప్రోత్సహించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతి జిల్లాలో పంటల వైవిధ్యీకరణ ప్రణాళికను అమలు చేసి, విత్తనాలను ముందుగానే రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 35 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని, అది మరింత పెరగకుండా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు.ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశమున్నందున కనీసం 50 శాతం వరి సాగును ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించే లక్ష్యంతో పనిచేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కంది, అలసందలు, పొద్దుతిరుగుడు వంటి పంటలను ప్రోత్సహించాలని సూచించారు.ఈ సందర్భంగా పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల కుటుంబాలకు తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం కానుందని మంత్రులు వెల్లడించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో వనమహోత్సవం, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతి, నీటి నిల్వల పర్యవేక్షణ వంటి అంశాలను కూడా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డిఆర్ఓ స్వామి, ఆర్డీవో షర్మిల పాల్గొన్నారు.

# కొత్తపల్లిని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఐ డిమాండ్



నందికొట్కూరు, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కొత్తపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఐ (ఎంఎల్) పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, ఐసా రాష్ట్ర కార్యదర్శి స్వామి దాసు నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో మండల కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిప్యూటీ తాసిల్దార్ అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జూన్--జూలై నెలల్లో వర్షపాతం 40 శాతం కూడా నమోదు కాలేదని, రైతుల పంటలు ఎండిపోయి నష్టపోయారని తెలిపారు. ఎకరాకు 40 వేల రూపాయల ఖర్చుతో సాగు చేసిన పంటలు చేతికి రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్తపల్లిని కరువు మండలంగా ప్రకటించి, కౌలు రైతులకు ఎకరాకు 40 వేల రూపాయల నష్టపరిహారం, ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ, రవి సీజన్‌లో విత్తనాలను పూర్తి సబ్సిడీతో అందించాలని, 60 ఏళ్లు దాటిన రైతులకు నెలకు పదివేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకాల నుంచి నీటిని విడుదల చేయాలని కూడా కోరారు.ఈ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వేణుగోపాల్ రెడ్డి, నందికుంట శివారెడ్డి, లక్ష్మన్న, బోయ రాములు, పెద్ద రాముడు, ఐసా జిల్లా నాయకులు వర్ధన్, చిన్న నాగార్జున, కాటేపోగు స్వామన్న, గుంపుల త్యాగరాజు, పిక్కిలి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ వెనుక మందకృష్ణ పోరాటం

– ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు తుడుం కిరణ్ మాదిగ



ఆమనగల్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్): ఆమనగల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మల్లెపోగు మల్లేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా నాయకుడు, మండల ఇంచార్జ్ తుడుం కిరణ్ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తుడుం కిరణ్ మాదిగ మాట్లాడుతూ.. నిరుపేద గుండెజబ్బుల చిన్నారులకు ఉచిత వైద్యం అందించాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 2004 ఆగస్టు 7న వేలాది మంది గుండెజబ్బుల చిన్నారులతో ట్యాంక్‌బండ్ వద్ద ర్యాలీ, ధర్నా నిర్వహించారని తెలిపారు. ఈ పోరాటం ఫలితంగానే ఆరోగ్యశ్రీ పథకం ఏర్పడిందన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చిన ఆరోగ్యశ్రీ పథకం తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి ఇంటికీ చేరిందని, దాని వెనుక జరిగిన సామాజిక పోరాటాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సైతం మందకృష్ణ మాదిగ పోరాటాన్ని ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు.మందకృష్ణ మాదిగ కేవలం వర్గీకరణ ఉద్యమానికే పరిమితం కాకుండా ప్రజా సంక్షేమం కోసం అనేక సామాజిక ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచారని తుడుం కిరణ్ మాదిగ కొనియాడారు. వృద్ధులు, వితంతువుల పెన్షన్లు, ఆహార భద్రత తదితర అంశాలపై కూడా ఆయన ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో మల్లెపోగు మల్లేష్ మాదిగ, పులికంటి మైసన్న, వస్పుల సాయిలు, దరువుల రామచంద్రయ్య, జంతుక జానయ్య, కొమ్ము నరసింహులు, విజయ్‌చందర్, అమర్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా మొక్క.. పర్యావరణానికి రక్ష




ఆమనగల్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనం పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ పిలుపునిచ్చారు. గురువారం 8వ వార్డు సంకటోనిపల్లిలో వార్డు కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పత్య నాయక్, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పత్య నాయక్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించినప్పుడే పచ్చదనం విస్తరిస్తుందని, ప్రకృతి సమతుల్యత కాపాడబడుతుందని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు, కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న హరిత కార్యక్రమాలకు ప్రజలు సహకరించి ప్రతి మొక్కను సంరక్షించాలని కోరారు. మొక్కల పెంపకంతో భూగర్భ జలాలు పెరిగి వాతావరణంలో సమతుల్యత ఏర్పడుతుందని తెలిపారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పత్య నాయక్ కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మొక్తాల వెంకటయ్య, నాగిళ్ల జగన్, అనుష శ్రీశైలం, మేనేజర్ ఆంజనేయులు, టౌన్ ప్లానింగ్ అధికారి, మున్సిపల్ ఏఈ రామకృష్ణ, షర్పు, మహబూబ్, మున్సిపల్ సిబ్బంది, యువజన సంఘాల నాయకులు సురేష్ నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# దీప కుటుంబానికి ఎమ్మెల్యే కసిరెడ్డి పరామర్శ



ఆమనగల్లు, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపాతి పుల్లారెడ్డి కుటుంబానికి చెందిన దీప ఇటీవల అమెరికాలో మృతి చెందారు. శుక్రవారం హైదరాబాద్‌లోని చంపాపేట సామ నర్సింహ గార్డెన్స్‌లో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దీప చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతురాలి మృతిపై తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మనోధైర్యాన్ని కోల్పోవద్దని ఎమ్మెల్యే సూచించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి

– గొర్రెల కాపరుల సంఘం మండల సదస్సులో డిమాండ్




**ఆమనగల్లు, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రెండో విడత గొర్రెల పంపిణీని నగదు బదిలీ విధానంలో వెంటనే ప్రారంభించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని బీఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో మండల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్‌పేట మల్లేష్ హాజరయ్యారు. గొర్రెలు, మేకల పెంపకందారులు తర తరాలుగా వృత్తిని కొనసాగిస్తూ సమాజానికి ఆహారాన్ని అందిస్తున్నప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని మల్లేష్ అన్నారు. గత 30 ఏళ్లుగా సంఘం ఆధ్వర్యంలో పెంపకందారుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి మేత హక్కులు, పశువైద్య సేవలు, జీవాలకు మందులు, మేత భూములు, ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి పరిహారం, రాయితీ రుణాలు వంటి అంశాల్లో ఫలితాలు సాధించామని తెలిపారు. జిల్లా నాయకులు కాస మల్లేష్ మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండో విడత గొర్రెల పంపిణీని రెండున్నరేళ్లు గడిచినా ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే నగదు బదిలీ ద్వారా పంపిణీ చేపట్టాలని, లేకపోతే సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గొర్రెల మేతకు సంబంధించిన జీవోలను సక్రమంగా అమలు చేయాలని, అటవీ భూముల్లో ఉచిత మేపునకు అవకాశం కల్పించాలని, గొర్రెలకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు దాటిన గొర్రెల కాపరులకు నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలని, ఖాళీగా ఉన్న పశువైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు. గొల్ల, కురుమ యువతకు రాయితీతో గొర్రెల ఫారాలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా సామూహిక గొర్రెల షెడ్లు నిర్మించాలని, ప్రతి గ్రామ సొసైటీకి సామాజిక భవనం నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 11న ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న చిన్నా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం ఆమనగల్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నిట్ట నారాయణ, అధ్యక్షులుగా కావటి కొండల్, ఉపాధ్యక్షులుగా కట్ట పర్వతాలు, టి. సత్యం, ప్రధాన కార్యదర్శిగా నిట్ట కొండల్, సహాయ కార్యదర్శులుగా డి. నారయ్య, ఈదమయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జల్లెల పెంటయ్య, నిట్ట నారయ్య, ముక్కెరీ కృష్ణయ్య, వివిధ సొసైటీల అధ్యక్ష, కార్యదర్శులు, గొల్ల, కురుమ కుల పెద్దలు, గొర్రెల కాపరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న విగ్రహం తొలగింపుపై స్థానికుల ఆగ్రహం




**అమ్రాబాద్, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం స్వయంగా విరాళాలతో ప్రతిష్టించిన మహనీయుడు పండుగ సాయన్న విగ్రహాన్ని ఆర్టీసీ అధికారులు తొలగించడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని చెత్తలో పడేయడం పట్ల ముదిరాజ్ సంఘం సభ్యులు నిరసన తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు భీసం అంజనేయులు నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు లింగాలలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద ఆర్టీసీ డీఎం పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి సస్పెండ్ చేయాలని, పండుగ సాయన్న విగ్రహాన్ని యథాస్థానంలో తిరిగి ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు శైలజ, కో-కన్వీనర్ వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షుడు నిరంజన్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజ, మైనార్టీ అధ్యక్షుడు షేక్ షావలి, రాష్ట్ర నాయకుడు గోరుట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనుల పరిశీలన



**నందికొట్కూరు, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరు పట్టణంలోని సాయిబాబాపేట స్కూల్ లైన్‌లో జరుగుతున్న కొత్త డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామిరెడ్డి, ఏఈ బి. దినేష్ కుమార్, సచివా లయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కమిషనర్ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# ప్లాస్టిక్‌పై విద్యార్థులకు అవగాహన

– 11 నుంచి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వారోత్సవాలు



**అమనగల్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి ప్లాస్టిక్ అవగాహన వారోత్సవాలను నిర్వహించనున్నట్లు క్లబ్ కార్యదర్శి లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, పీఆర్వో లయన్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే మార్గాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు దీర్ఘకాలం నేలలో కరగకుండా ఉండటంతో భూసారం దెబ్బతినడంతో పాటు వర్షపు నీటి కాలువలు మూసుకుపోయి వరదలకు కారణమవుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు, పక్షులు, జలచరాలు మింగడం వల్ల వాటి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందన్నారు. ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల వెలువడే విషవాయువులతో వాయు కాలుష్యం పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులు, స్టీల్ లేదా రాగి సీసాలను వినియోగించాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా రీసైక్లింగ్‌కు పంపించాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, పరిసర ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, 'ప్లాస్టిక్ రహిత సమాజం–– పరిశుభ్రమైన భవిష్యత్తు' లక్ష్య సాధనకు ప్రజలు సహకరించాలని పీఆర్వో లయన్ పాషా పిలుపునిచ్చారు.

# సునీత ప్రశాంత్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి



**ఆమనగల్లు, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ సునీత ప్రశాంత్ నాన్నమ్మ మృతిచెందిన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ శుక్రవారం వారి నివాసానికి చేరుకుని మృతురాలికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కౌన్సిలర్ సునీత ప్రశాంత్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతురాలు కుటుంబానికి అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మొక్తల వెంకటయ్య, నాగిళ్ల జగన్, ఎనుమల్ల రమేష్, అనూష శ్రీశైలం, మాజీ వార్డు సభ్యుడు పూసలి సత్యం పాల్గొని మృతురాలికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# మర్రిగూడలో మండల స్థాయి సమీక్ష సమావేశం



**మర్రిగూడ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఎంపీడీవో మున్నయ్య ఆధ్వర్యంలో 15 అంశాలపై తీర్మానాలు చేశారు. మండల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎస్ఐ ఆర్, భూ రీ సర్వే అధికారులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "గ్రామాల్లో తాగునీరు సక్రమంగా అందడం లేదు. అధికారులు ఫోన్ ద్వారా సమాచారం తీసుకోవడమే తప్ప క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదు" అని మండిపడ్డారు. తక్షణ చర్యలు తీసుకుని నిరంతర నీటి సరఫరా జరిగేలా చూడాలని కోరారు. సర్వసభ్య సమావేశంలో యరగండ్లపల్లి గ్రామ సర్పంచ్ వల్లెంల సంతోష్ యాదవ్ మాట్లాడుతూ, "వ్యవసాయ, అంగన్వాడీ పోస్టుల భర్తీతో పాటు పలు శాఖల అధికారుల తీరుపై అసంతృప్తి ఉంది. రైతు వేదికల నుంచి వచ్చిన వారికి మాత్రమే ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు పూర్తి సమాచారం ఇవ్వడం లేదు" అని ఆరోపించారు. ఈ సమావేశంలో ఎంపీఓ రవికుమార్, ఎంఈఓ శారద, వివిధ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతిని చాటిన బోనాల వేడుకలు

– అరబిందో పాఠశాలలో ఆషాఢ మాసం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం



**ఆమనగల్లు, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు పట్టణంలోని అరబిందో పాఠశాలలో ఆషాఢ మాసం సందర్భంగా బోనాల పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాల ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు అలంకరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. బోనాల పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతిలో దాని ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాటలు, నృత్యాలతో సందడి చేస్తూ పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందంతో పాటు మన సంప్రదాయాలపై ఆసక్తిని పెంపొందించింది. ఈ కార్యక్రమంలో అకాడమిక్ అడ్వైజర్ ప్రేమ కుమారి, ప్రిన్సిపాల్ నాగమణి, శోభతో పాటు విద్యార్థినులు కండె నేత్రిక, ఆద్య, లక్ష్మి, ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ విద్య వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

– ఎస్ఎఫ్ఐ పిలుపు



**దేవరకొండ,ఆగస్టు 7(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** మునుగోడు నియోజకవర్గం,నాంపల్లి మండల కేంద్రంలో ఈ నెల 8, 9 తేదీలలో నిర్వహించనున్న ఎస్ ఎఫ్ ఐ విద్య––వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది.

ఈ సందర్భంగా దేవరకొండ డివిజన్ కేంద్రంలో శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకత్వం ఆవిష్కరించిన. అనంతరం ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ నేటి విద్యారంగంలో జరుగుతున్న పరిణామాలు, శాస్త్రీయ దృక్పథం,రాజ్యాంగ విలువలు,విద్యార్థి ఉద్యమాల చరిత్ర,సామాజిక బాధ్యతలపై దేశ రాష్ట్ర రాజకీయాలు విద్యారంగంపై ఎదురైతున్న సవాళ్లు సమస్యలను చర్చించి భవిష్యత్తులో చేపట్టే ఉద్యమాలను కార్యచరణను ఈ శిక్షణా తరగతుల్లో చర్చలు, అవగాహన పంపించడం జరుగుతుందని అన్నారు అందువల్ల దేవరకొండ డివిజన్ పరిధిలోని ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, విద్యార్థులు ఈ శిక్షణా తరగతులకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు,రామావత్ రాజేష్,ఆంబోత్ శివ,ఎన్ను పోతుల పరమేష్, జైరాం, మనోహర్, ఆంజనేయులు, అరవింద్, అశ్విని, అంజల్లి మధు ప్రియా, అంకిత, గీత సంతోష, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# డీఏపీ కొరత లేకుండా తెలంగాణకు సరఫరా పెంచాలి

– కేంద్ర మంత్రి నడ్డాను కోరిన ఎంపీ మల్లు రవి



**ఆమనగల్లు, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో రైతులకు డీఏపీ ఎరువు కొరత తలెత్తకుండా రాష్ట్రానికి తగినంతగా సరఫరా చేయాలని శుక్రవారం నాగంకర్నూల్ ఎంపీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాను కోరారు. ఈ మేరకు మంత్రి నడ్డా పార్లమెంట్ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం సమర్పిం చారు. తెలంగాణలో సాగు అవసరాలకు అనుగుణంగా డీఏపీ కేటాయింపులు పెంచి, రైతులకు సకాలంలో ఎరువు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన లోక్‌సభ ఎంపీలందరూ సంతకాలు చేశారు. రైతుల సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి నడ్డా సానుకూలంగా స్పందించినట్లు మల్లు రవి తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో డీఏపీ లభ్యతపై రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా ఎంపీ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎరువుల సరఫరాలో జాప్యం లేకుండా కేంద్రం నుంచి రాష్ట్రానికి నిరంతరంగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పుట్టినరోజుని పురస్కరించుకొని రక్తదానం చేసిన డిప్యూటీ మేయర్

– ఆపదలో ఉన్న వారి కోసం రక్తదానం: మహమ్మద్ అష్రఫ్ అలీ



**నల్లగొండ, ఆగస్టు 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జన్మదినోత్సవ వేడుకలను ఆర్భాటాలకు దూరంగా నిర్వహిస్తూ, ఆపదలో ఉన్న వారికి తన వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కార్పొరేషన్ తొలి డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ తెలిపారు. శుక్రవారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 100 మంది పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, ఆయా వార్డుల ప్రజలు రక్తదాన శిబిరం వద్దకు చేరుకుని అసఫ్ అలీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ మాట్లాడుతూ.. జన్మదినోత్సవం సందర్భంగా చేసే ఆర్భాటాల కంటే ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడేందుకు సహకరించడం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, అభిమానులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
శనివారం,
ఆగస్టు 08, 2026



## రాంరెడ్డిపల్లి లో ఉచిత మెగా వైద్య శిబిరం



**మర్రిగూడ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎక్స్‌పర్ట్ టెలి మెడిసిన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.గ్రామ ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి, డాక్టర్ కన్సల్టేషన్ మరియు అవసరమైన మందులు పూర్తిగా ఉచితంగా అందించారు. గ్రామ సర్పంచ్ లపంగి నరసింహ మాట్లాడుతూ, “గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొగాకు సైదులు, గ్రామ శాఖ అధ్యక్షుడు కార్యం నరసింహ, వార్డు సభ్యులు పగిళ్ల శంకర్, భీమనగోని యాదయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సలీవోజు యాదయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి నజీరా, సీనియర్ నాయకులు పాపారావు, పగిళ్ల నరసింహ, ఎక్స్‌పర్ట్ టెలి మెడిసిన్ వైద్య బృందం, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాంరెడ్డిపల్లి వివో భవనానికి శంకుస్థాపన అడ్డంకులు సృష్టిస్తే కఠిన చర్యలు

**మర్రిగూడ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలంలోని కుదాభాక్షుపల్లి గ్రామంలో వివాదాస్పదంగా మారిన 188 గజాల గ్రామకంఠ భూమిలో శుక్రవారం ట్రైనీ కలెక్టర్ వివేక్, డిపిఓ తరుణ్ చక్రవర్తి, గ్రామ సర్పంచ్ జయలక్ష్మి పాండు గౌడ్తో కలిసి వివో భవనానికి శంకుస్థాపన చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దూది రాజు, మర్రిగూడ ఎస్సై బి. రాంబాబు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ వివేక్ మాట్లాడుతూ, “వివో భవన నిర్మాణానికి



ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి” అని ఎస్సైకి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పలు అధికారులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో శ్రీమతి కె.లతకు అదనపు బాధ్యతలు



**సూర్యాపేట, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సూర్యాపేట జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా సేవలందిస్తున్న శ్రీమతి కె.లత, ఇప్పుడు జిల్లా డిఎస్సీడివోగా మరియు ఇడి, ఎస్సీ కార్పొరేషన్ అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టర్, అదనపు జిల్లా కలెక్టర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కూడా ఆమె డిఎస్సీడివోగా పూర్తి స్థాయి బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించి మంచి గుర్తింపు పొందారు. ఇప్పుడు మరోసారి ఈ బాధ్యతలను చేపడుతుండటంపై పలువురు అధికారులు, సిబ్బంది, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆమెకు సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి కె.లత మాట్లాడుతూ, “జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో నిష్టతో పనిచేస్తాను” అని స్పష్టం చేశారు.

## షాద్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి పై సమీక్ష

**షాద్‌నగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** షాద్‌నగర్ పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు పై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రహదారుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సభ్యులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో



పనిచేయాలి” అని సూచించారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు తమ తమ వార్డుల అభివృద్ధి అవసరాలు, ప్రజా సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా, వాటిపై చర్చించి అవసరమైన తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అడ్డగుట్టలో దివ్యంగునికి వీల్‌చైర్ అందజేత



**అడ్డగుట్ట, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శుక్రవారం తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో, సికింద్రాబాద్ మహిళా నాయకులు దొంత కళాజ్యోతి, సరిత సహకారంతో దివ్యాంగుడు దేవేందర్ కు వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్ మాట్లాడుతూ, “పెండ్లి, పుట్టినరోజు వంటి వేడుకలను పురస్కరించుకొని నిరుపేదలకు, దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందించడం సమాజానికి మేలు చేస్తుంది” అని పిలుపునిచ్చారు. దొంత కళాజ్యోతి గతంలో కూడా అనేక మందికి కుట్టుమిషన్లు, పుస్తకాలు అందించి, స్వయం ఉపాధి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల ప్రశంసలు పొందినట్లు ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో వాణి, శ్రీవాణి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండలో జైల్ బరో విజయవంతం చేయాలని సిఐటియు పిలుపు

**నల్లగొండ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక--రైతు--ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నల్లగొండ పట్టణంలో జరగనున్న జైల్ బరో నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట్ రవీందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నల్లగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో లైన్ వాడ, మాన్యం చెల్క, పానగల్లు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు



నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికుల పోరాటంతో సాధించిన 29 చట్టాలను రద్దు చేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి మద్దతు ధర చట్టం చేయాలని, విద్యుత్ సంస్కరణ చట్టాన్ని రద్దు చేయాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని వారు స్పష్టం చేశారు. జైల్ బరో సందర్భంగా నల్లగొండ పట్టణంలో జరిగే నిరసన ర్యాలీలో ఆశా కార్యకర్తలంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు ఎడవెల్లి ప్రేమలత, సిహెచ్ వీరభద్రమ్మ, శోభారాణి, అనురాధ, సబిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం

**తిప్పర్తి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక--రైతు--ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు జరుగుతున్న జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం పిలుపునిచ్చారు. తిప్పర్తి సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ సమావేశం నిర్వహించి, అనంతరం డాక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. గ్రామపంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో ఎంపీడీవోకు కూడా జైల్ బరో కార్యక్రమానికి సంబంధించిన వినతి పత్రం ఇచ్చారు. తిప్పర్తి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ, “ఎందరో పోరాట యోధుల ప్రాణత్యాగాలతో సాధించిన స్వాతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలపై కార్మిక వర్గం, రైతాంగం, ప్రజలు తిరగబడాలి. నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజలు జైల్ బరోలో పాల్గొనాలి” అని పిలుపునిచ్చారు. గత 12



సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక--రైతు హక్కులను కాలరాసే విధంగా పాలన కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లతో కార్మిక హక్కులను రద్దు చేశారని, విద్యుత్ సవరణ చట్టం, విత్తన చట్టం ద్వారా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కొత్త పథకంతో 30 కోట్ల మంది వ్యవసాయ కార్మికుల జీవితాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. దేశానికి అన్నం పెడుతున్న రైతులను, సంపద సృష్టించే కార్మిక వర్గాన్ని మోసం చేస్తూ ప్రజా కంటకంగా మారిన మోడీపై ప్రజలందరూ యుద్ధం ప్రకటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జరిగే జైల్ బరోలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ విధానాలకు ప్రజా ప్రతిఘటనను ఆగ్రహంగా తెలియజేయాలని కోరారు. అదేవిధంగా స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26,000గా నిర్ణయించాలని, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి. పార్వతమ్మ, డి. నిర్మల, యల్లమ్మ, పులమ్మ, కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య, పర్శరాములు, పోలగోని యాదమ్మ, సైదమ్మ, రూతమ్మ, పుష్పలత, జ్యోతి, సౌందర్య, రాజేశ్వరి, సునీత, వసంత, రుద్రమ్మ, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

## పండుగల సాయన్న విగ్రహాన్ని వెంటనే పునఃప్రతిష్ఠించాలి

**లింగాల, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లింగాల మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ ఆవరణలో ఉన్న పండుగల సాయన్న విగ్రహాన్ని తొలగించడాన్ని నిరసిస్తూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షుడు అతినారపు సాయి సాగర్ మాట్లాడుతూ, “ఉమ్మడి పాలమూరు ప్రాంతానికి చెందిన బీసీ నాయకుడు, పేదల పెన్నిధి పండుగల సాయన్న విగ్రహాన్ని తొలగించడం సరికాదు. ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న మహనీయుడి విగ్రహాన్ని తొలగించడం ద్వారా బీసీల మనోభావాలను అవమానించారు” అని విమర్శించారు. అతను ఇంకా మాట్లాడుతూ, “నాటి నుంచి



నేటి వరకు కాంగ్రెస్ పాలనలో బీసీ నాయకులకు తగిన గుర్తింపు లేదు. బీసీ నాయకుల చరిత్రను ప్రజలకు తెలియకుండా చేసే ప్రయత్నాలు గతంలో జరిగాయి. లింగాల మండల కేంద్రం నడిబొడ్డున ఒక బీసీ నాయకుడి విగ్రహం ఉంటే ఎవరికీ ఇబ్బంది ఏమిటి? ఎందుకు భయపడుతున్నారు?” అని ప్రశ్నించారు. పండుగల సాయన్న పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన నాయకుడని, ఆయన చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సాయి సాగర్ పేర్కొన్నారు. విగ్రహాన్ని ఎక్కడి నుంచి తొలగించారో అదే ప్రాంతంలో వెంటనే పునఃప్రతిష్ఠించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల మనోభావాలను గౌరవించి అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు.

## బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి

**– సిపిఐ మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్**

**తెల్కపల్లి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న పాదయాత్రలను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్ పిలుపునిచ్చారు. శనివారం గట్టు రాయిపాకులలో “బాద్ రావు జరూరి -- హై మార్పు కావాలి” అనే కరపత్రాలను, వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, “బీజేపీ ప్రభుత్వం పై దేశవ్యాప్తంగా ఆందోళనలు, వ్యతిరేకత పెరుగుతున్నాయి. గత దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం అత్యంత



పురోగతిని సాధించిందని ప్రకటిస్తున్నా, ప్రజల నిజ జీవితం, దేశ ప్రగతి అందుకు విరుద్ధంగా ఉంది” అని ఆరోపించాం. పెరుగుతున్న నిరుద్యోగం, ప్రజల ఆదాయాలు పెరగకపోవడం వల్ల జీవన విధానం భారంగా మారిందని, గ్రామాల్లో సంక్షోభం తీవ్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆగస్టు 6 నుంచి 14 వరకు దేశవ్యాప్తంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ తీరును వివరించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 10న తెల్కపల్లి మండలంలోని కార్వంగా మీదుగా మూడు రోజుల పాటు పాదయాత్ర కొనసాగుతుందని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గట్టు రాయిపాకుల సిపిఐ కార్యదర్శి గొడుగు విష్ణు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో గోరింటాక ఫ్రెండ్షిప్ డే సందడి

**కల్వకుర్తి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆషాఢమాసం పురస్కరించుకొని కల్వకుర్తి వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఆర్యవైశ్య మహిళలు గోరింటాకు, ఫ్రెండ్షిప్ డే వేడుకలతో సందడి చేశారు. మహిళలు ప్రత్యేకంగా ఎరుపు చీరలు, ఆకుపచ్చ బ్లౌజులు ధరించి దేవాలయానికి తరలి వచ్చారు. గోరింటాకులను రోకళ్లతో దంచి ఒకరికొకరు చేతులకు పెట్టుకుని ఆనందంగా అలరించారు. అదే సమయంలో ఫ్రెండ్షిప్ డే సందర్భంగా ఒకరికొకరు బ్యాండ్లు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ, “ఆషాఢమాసంలో గోరింటాకును అరచేతులకు పెట్టుకోవడం ఆరోగ్యానికి, అందానికి మేలు చేస్తుంది. వర్షాకాలంలో వచ్చే



తేమ వ్యాధుల నుండి రక్షణ పొందడానికి ఇది సహజ నివారణగా పనిచేస్తుంది” అని తెలిపారు. సంప్రదాయానికి అద్దం పడే ఈ ఆచారం తరతరాలుగా కొనసాగుతోందని వారు పేర్కొన్నారు. మహిళలు కలిసికట్టుగా ఫ్యాషన్ డిజైన్‌లతో గోరింటాకులను అలంకరించుకోవడంతో దేవాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు బాదం సాయి లక్ష్మీ, గోవిందు మౌనిక, జూలూరి మౌనిక, చిగుళ్లపల్లి రమాదేవి, మారం సుమలత, చిత్తనూరి రూప, పాపిశెట్టి స్వప్న, దొంతు శ్రీలత, పాపిశెట్టి రాజేశ్వరి, పోల లావణ్య, దాచిపల్లి రోజారాణితో పాటు అధిక సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

## బీజేపీ నేత గువ్వల బాలరాజు అక్రమ అరెస్టును ఖండించిన కల్వకుర్తి నాయకులు

**కల్వకుర్తి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట తాలూకా లింగాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పోరాట యోధుడు పండుగ సాయన్న విగ్రహం అక్రమ తొలగింపుపై దీక్ష చేస్తున్న ముదిరాజ్ నాయకులను పరామర్శించడానికి వెళ్తున్న బీజేపీ నేత గువ్వల బాలరాజును కల్వకుర్తి సమీపంలోని కొట్ర చౌరస్తాలో పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తా అంబేద్కర్ విగ్రహం ముందు బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.



“ఒకవైపు తెలంగాణ పోరాట యోధుని విగ్రహాన్ని తొలగించడం, మరోవైపు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులను పరామర్శించడానికి వెళ్తున్న గువ్వల బాలరాజును అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యాన్ని అణచివేయడమే. కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వానికి పాల్పడుతోంది” అని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గన్నోజు బాబీదేవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ధన్నోజు నరేష్ చారి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బోడ నరసింహ, 11వ వార్డు కౌన్సిలర్ ఎనుగొండ రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్దారి పర్వతాలు, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాప శివ, పట్టణ కోశాధికారి లక్ష్మీనరసింహ, నాయకులు వాగుల్ దాస్ నరేష్ గౌడ్, కొల్లే దామోదర్, శ్రీకర్, తోడేటి అరవింద్ రెడ్డి, అఖిల్ చారి, చింటూ, సాయి, గోపాల్ నాయక్, మహేష్, బొడ్డు పల్లి అరవింద్, లడ్డు యాదవ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

# సర్ రివ్యూ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి



**నాగర్‌కర్నూలు, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలో జరిగిన సర్ రివ్యూ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, సర్ పార్లమెంట్ ఇంచార్జ్ సిద్దేశ్వర్ రాచమల్ల, నియోజకవర్గ ఇంచార్జ్ వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ హాజరయ్యారు. సమావేశంలో సర్ కోఆర్డినేటర్స్ శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బంగారి పర్వతాలు, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ రెడ్డి, జి. హరీష్ రెడ్డి, మద్దెల చంటి, నిరంజన్, శ్రీనివాస్ రెడ్డి, పొడుగు శీను, ఎండి నిజాం, యాదయ్య, బుచ్చిరెడ్డి, ఎండి సలీం, సి. మల్లేష్, చిక్కంద్ర మల్లేష్, అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి, కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి, మండల పార్టీ అధ్యక్షులు కోటయ్య, జక్క రాజు రెడ్డి, వివేక్ రెడ్డి, మిద్దె రాములు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి తల్లి గుర్తించాలి



**తలకొండపల్లి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ప్రతి తల్లి శిశువుకు తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించాలి. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాల పాత్ర అత్యంత కీలకం" అని పేర్కొన్నారు. తల్లులకు పోషకాహారం, శిశు సంరక్షణపై అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం అక్షరాభ్యాస కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అంతుల్ బేగం, సమంత, గ్రామపంచాయతీ సెక్రటరీ రమాదేవి, వార్డు సభ్యులు వాజీద్, లట్టుపల్లి వసంత, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించిన సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి



**తలకొండపల్లి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. ఆమె విద్యార్థినీ, విద్యార్థులను కలుసుకుని ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, "ప్రభుత్వం అందజేసిన షూ, యూనిఫామ్‌లు త్వరలోనే విద్యార్థులకు పంపిణీ చేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ వార్డు సభ్యుడు వాజిద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించిన సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు



**వెల్దండ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థులకు పరిశుభ్రమైన, పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ బాధ్యత. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం వండాలి. నాసిరకమైన బియ్యం, కూరగాయలు లేదా ఇతర ఆహార పదార్థాలు సరఫరా చేస్తే వాటిని తీసుకోవద్దు" అని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే, "విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, సురక్షితమైన వాతావరణం అందించడం ప్రభుత్వ బాధ్యత. విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకూడదు" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ బాలరాజు, ఉప సర్పంచ్ కొండల్, వార్డు సభ్యుడు సామ కుమారస్వామి, కేశమోని జంగయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ముందస్తు అరెస్ట్



**ఊర్కొండ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు గువ్వల బాలరాజు ముందస్తు అరెస్టు చేయబడ్డారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, "అచ్చంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా అరాచక పాలన సాగిస్తున్నారు. లింగాల మండలం కొత్తకుంటపల్లి గ్రామంలో ఐదు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకే అక్రమంగా తొలగించారు. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉన్న ముదిరాజ్ సోదరుల మనోభావాలను, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టి వ్యవహరిస్తోంది" అని ఆరోపించారు. అతను ఇంకా మాట్లాడుతూ, "నేడు లింగాల మండల కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని తొలగించి ముదిరాజుల గొంతునొక్కాలని చూస్తున్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ముదిరాజులకు సంఘీభావం తెలపడానికి వెళ్తున్న నన్ను, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్రమంగా అదుపులోకి తీసుకుని ఊర్కొండపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు" అని తెలిపారు. ప్రజా సమస్యలను వెలికితీస్తాడనే భయంతోనే తమ నాయకులను, ప్రజలను అణచివేస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ప్రజాసంపదను నాశనం చేస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# మృతుని కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం



**కల్వకుర్తి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామం 1వ వార్డు నివాసి నెంట వెంకటేష్ అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ శుక్రవారం మృతుని కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సునీత వెంకట్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కడల సంతోష మల్లేష్, మాజీ ఉప సర్పంచ్ మదన్మోహన్ రావు, విజయ డైరీ అధ్యక్షుడు కంకల శ్రీశైలం, వార్డు సభ్యులు వట్టేపు కిషోర్, పెరుమాళ్ళ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణానికి సిమెంట్ అందజేసిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్



**కల్వకుర్తి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండల పరిధిలోని తాండ్ర గ్రామంలో ముద్రకొల్ల జంగయ్య, పెంటయ్య, బొల్లే పరిశరాములు, అల్లంపల్లి సంతోష్ కుటుంబాల ఇళ్ల నిర్మాణం సిమెంట్ లేక మధ్యలో నిలిచి పోయింది. ఈ విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ వెంటనే స్పందించి నాలుగు ఇండ్లకు సిమెంట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజల అవసరాలు తీర్చడంలో ఎల్లప్పుడూ ముందుండే ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, నిరుపేదలకు అండగా నిలుస్తుంది. ఇళ్ల నిర్మాణం పూర్తి కావడం ద్వారా కుటుంబాలు సురక్షితంగా జీవించ గలుగుతాయి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుశీల ఈశ్వరయ్య, మాజీ ఉప సర్పంచ్ మైబు యాదవ్, రామస్వామి, గోరటి కృష్ణయ్య, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

# అజీమ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్




**కల్వకుర్తి, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణానికి చెందిన పూల వ్యాపారి అజీమ్ (55) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినా, అక్కడే ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటనపై మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు ఏజాస్ మక్బూల్, రాజేష్ కుమార్, చిత్తారి శ్రీనివాసులు అజీమ్ నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, "మీ ఆపదలో మేము అండగా ఉంటాం" అని భరోసా కల్పించారు. అజీమ్ ఆకస్మిక మృతి పట్టణంలో దుఃఖాన్ని నింపింది. కులమతాలకు అతీతంగా గ్రామీణ ప్రాంతాలనుండి ప్రజలు తరలి వచ్చి కన్నీరు మున్నీరుగా విలపించారు. సౌమ్య స్వభావం కలిగిన అజీమ్ అందరితో పరిచయాలు కలిగి ఉండటంతో ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తమైంది. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంతు యాదవ్, సోఫి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు గ్రామాల్లో బాలికలకు హెచ్‌పీవీ టీకాలు



**ఎలిగేడు, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్, దూళికట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం 14 ఏళ్లు దాటిన 18 మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యులు నిస్సీ క్రిష్టాన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొంరయ్య, ఉప సర్పంచ్ మేచినేని అండాలు, ఎంఈవో అనసూరి నరేంద్ర చారి, హెచ్‌ఎం బిజిలి సదయ్య, వార్డు సభ్యుడు గీసా బొందయ్య, స్టాఫ్ నర్సులు స్వప్న, లత, డాక్టర్ సిందూర, సూపర్‌వైజర్లు లక్ష్మన్, నాగమణి, జీపీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడులో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**ఎలిగేడు, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు బాలామృతం పంపిణీ, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, సీమంతం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ, "తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారం. పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఎదుగుతారు. తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. అనంతరం వైద్యుల సూచనల మేరకు అదనపు పోషకాహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలి" అని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది మాట్లాడుతూ, "తల్లిపాలు శిశువుల శారీరక, మానసిక వికాసాన్ని మెరుగుపరుస్తాయి. తల్లుల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. అపోహలను తొలగించి ప్రతి తల్లి తప్పనిసరిగా తల్లిపాలు అందించాలి" అని వివరించారు. తరువాత తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సరోజ, సరస్వతి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎస్సీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని శేఖర్ మాస డిమాండ్



**చిలుకానగర్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం ప్రకటించిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సేవా సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శేఖర్ మాస డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దళిత బంధు, ఎస్సీ కార్పొరేషన్ నిధులు, ఎస్సీ యువతకు బైకులు, ఆటోలు వంటి ఉపాధి పథకాలపై చేసిన హామీలను వెంటనే అమలు చేసి, ఎస్సీల అభివృద్ధికి అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయాలి" అని అన్నారు. అలాగే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్నారు. ఎస్సీల సంక్షేమానికి సంబంధించిన అన్ని పథకాలను పారదర్శకంగా అమలు చేసి, సామాజిక న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# తీదేడు గ్రామంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**దేవరకొండ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ సూపర్వైజర్ ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యమైనది. మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి" అని సూచించారు. అలాగే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రావు లక్ష్మి, గ్రామ మహిళలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాలు ధరించి నేతన్నకు అండగా నిలుద్దాం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "భారతీయ సంస్కృతికి, అద్భుతమైన కళానైపుణ్యానికి సజీవ సాక్ష్యం మన చేనేత. మగ్గంపై అద్భుతాలు సృష్టిస్తూ మన సంప్రదాయాన్ని బతికిస్తున్న నేతన్నలకు మనమంతా అండగా నిలవాలి. చేనేత వస్త్రాలను ధరించి వారిని ప్రోత్సహిద్దాం" అని పిలుపునిచ్చారు. అలాగే, తెలంగాణ ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# మేడ్చల్ తూప్రాన్ రూట్‌లో ఆర్డినరీ బస్సులు నడపాలని వినతి

**మనోహరాబాద్, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడ్చల్--తూప్రాన్ రూట్‌లో ఆర్డినరీ బస్సుల స్థానంలో మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపడం వలన విద్యార్థులకు అదనపు భారం పడుతోందని, మళ్లీ ఆర్డినరీ బస్సులను తగిన సంఖ్యలో నడపాలని మనోహరాబాద్ గ్రామపంచాయతీ పాలకవర్గం డిమాండ్ చేసింది. విద్యార్థులు ఇప్పటికే సుమారు రూ.1,200 వరకు చెల్లించి బస్ పాస్‌లు తీసుకున్నప్పటికీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కాళ్లకల్ వరకు పాస్ వర్తించక అదనంగా టికెట్ తీసుకోవాల్సి వస్తోందని వారు తెలిపారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ఆర్డినరీ బస్సుల సంఖ్యను పెంచి విద్యార్థులు, సాధారణ ప్రయాణికుల ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ డిపో అసిస్టెంట్ మేనేజర్ రామరాజు గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్, ఉప సర్పంచ్ టెక్మాల్ వెంకట్ రెడ్డి, న్యాయ విద్యార్థి చెలిమెల మణివర్ధన్తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థికి అండగా నిలిచిన జూపల్లి భాస్కర్ రావు



**చారకొండ, ఆగస్టు 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చారకొండ మండల పరిధిలోని గోకారం గ్రామానికి చెందిన బాధగొని కమల్ అనే విద్యార్థి పేదరికంతో చదువు ఆపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గోకారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, "చదువుకు పేదరికం అడ్డు కాదు, జేబీఆర్ ట్రస్టు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని ధైర్యం చెప్పారు. బీటెక్ చదువుతున్న కమల్‌కు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు ముందుకు వచ్చి రూ.30,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటాం. చదువును ఆపకుండా ముందుకు సాగాలి" అని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో గోకారం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు